# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 16-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:268 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

ఇంధన మోత
యుద్ధం తెచ్చిన తంట
ఆర్థిక మాంద్యం.

తాటి నీరము
రోగనిరోధక రసం
మత్తు పానీయం.

రెండు ధ్రువాలు
అయస్కాంత క్షేత్రాలు
జనం బందీలు.

మ్యాన్ హోళ్ల ఛిద్రం
పాదా చారులు భద్రం
నేలపై దృష్టి.

ఈత ఆకులు
నేతల ప్రతిజ్ఞలు
రాలి పడవు.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

సాగు లేక తాగు లేక
ముంచు కొచ్చు కరువు !
కొండ వచ్చి మీద పడితె
మోయలేని బరువు !
ఒకరినొకరు గుద్దుకుంటు
రాజకీయ పుర్రెలు !
తలలు వాల్చి ఊపుకుంటు
ప్రజలు వెర్రి గొర్రెలు !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# ఇరాన్‌పై మరోసారి అమెరికా వైమానిక దాడులు.. 260 మందికి గాయాలు..

న్యూఢిల్లీ, జులై 15:ఇరాన్‌పై మరోసారి అమెరికా విరుచుకుపడింది. ఇరాన్ రేవులు, స్థావరాలే లక్ష్యంగా యూఎస్ సెంట్రల్ కమాండ్ వైమానిక దాడులు చేసింది. బుధవారం బందర్ అబ్బాస్ పోర్ట్ సిటీతో పాటు పలు తీరప్రాంత కేంద్రాలపై దాడులు జరిపింది. ఈ దాడుల్లో 260 మందికి పైగా గాయపడ్డారని ఇరాన్ ఆరోగ్యశాఖ ప్రకటన విడుదల చేసింది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. బ్రెహెయిన్, ఒమన్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై క్రూయిజ్ మిస్సైల్స్‌ను ప్రయోగించింది.

హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో.. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా నిలిచిపోయింది. ట్రంప్ సర్కార్ ఇరాన్ రేవులు, ఆయిల్ టెర్మినల్స్‌పై సముద్ర దిగ్బంధాన్ని మరింత కఠినతరం చేసింది. దీంతో మిడిల్ ఈస్ట్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే ఇంధన ఎగుమతులను పూర్తిగా నిలిపివేస్తామని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా - ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల సంక్షోభం నెలకొనే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**హోర్ముజ్‌లో టోల్ నిర్ణయంపై వెనక్కు తగ్గిన ట్రంప్**

హోర్ముజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించటం కోసం 20 శాతం టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ ఈ నిర్ణయంపై వెనక్కు తగ్గారు. టోల్ ప్రకటనను ఉపసంహరించుకున్నామని తెలిపారు. గల్ఫ్ దేశాల పెట్టుబడులతో ఖర్చు భర్తీ చేస్తామని వెల్లడించారు. వాణిజ్య ఒప్పందాలకే ప్రాధాన్యం ఇస్తామని అన్నారు.

# దేశ ప్రజలకు చల్లని కబురు.. రుతుపవనాలు మళ్లీ పుంజుకున్నాయన్న ఐఎండీ

హైదరాబాద్, జులై 15: ఎల్‌నినో ప్రభావంతో దేశంలో రుతుపవనాలు సరిగా విస్తరించక వానలు కరువయ్యాయి. వానలు లేక ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. ఇన్నాళ్లు మందగించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా మళ్లీ పుంజుకోనున్నాయని తెలిపింది. బంగాళాఖాతం లో ఏర్పడుతున్న ఒక బలమైన అల్పపీడన ద్రోణి కారణంగా రుతుపవనాలు తిరిగి చురుగ్గా మారేందుకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెప్పారు.

ఈ తాజా అల్పపీడన ప్రభావంతో జూలై మూడో వారంలో దేశవ్యాప్తంగా వర్షాలు మళ్లీ ఊపందుకోనున్నాయి. ప్రధానంగా మధ్య భారత్, దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాలు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా), తూర్పు రాష్ట్రాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. వ్యవసాయ పనులకు ఈ వర్షాల పునరాగమనం ఎంతో కీలకం కానున్నది. వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఈ వార్త పెద్ద ఊరటనిస్తోంది.

ఈ అల్పపీడన వ్యవస్థ పశ్చిమ-వాయవ్య దిశగా కదిలే కొద్దీ దేశంలోని అంతర్గత ప్రాంతాలలో మేఘాలు దట్టంగా అలముకుని, రాబోయే వారం రోజుల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. రాబోయే 48 గంటల్లో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క కీలక సమీక్ష



హైదరాబాద్, జులై 15: మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సీతక్క ఈరోజు(బుధవారం) సచివాలయంలో కీలక సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, పప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. టేక్ హోమ్ రేషన్ (ఒఊఖీ) పంపిణీలో వేగం పెంచాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల హాజరును పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పలు పథకాల కింద బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లాల వారీగా పనితీరును పరిశీలించారు. అంగన్వాడీ 'తొలిముద్ద' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

# నోయిడాలో భారీ అగ్నిప్రమాదం.. ఇద్దరి మృతి

నోయిడా, జులై15: నోయిడాలోని మామురా గ్రామంలో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. 50 కుటుంబాలను రక్షించినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ బైక్‌లో చెలరేగిన నిప్పురవ్వలే ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రాధశ్రీ రాగాలు**

సిరుల నిడి కాపాడు
శ్రీ నారసింహుండు
యాదగిరి లోనుండు
నను రాధశ్రీ !!
కోరిన వరమ్ము నిడు
కేసరీ నందనుడు
కొండగట్టున నుండు
నను రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210


ఆహ్వానం
వేముల సత్యనారాయణ రచన
నేనూ... నా ప్రపంచం
ఉద్యోగ ప్రస్థానం
(యాభై రెండేళ్ల డైరీ కథనం)
పుస్తకావిష్కరణ సభ
వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
జులై 19, 2026 ఆదివారం ఉ. 10 గం.లకు
సభాధ్యక్షులు :
అన్నవరం దేవేందర్, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
ముఖ్య అతిథి-ఆవిష్కర్త :
డా. మచ్చ హరిదాసు, కవి, రచయిత
విశిష్ట అతిథులు :
డా. నలిమెల భాస్కర్, బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
జూకంటి జగన్నాథం, కవి, రచయిత, రాష్ట్ర ప్రభుత్వ దాశరథి పురస్కార గ్రహీత
పెద్దింటి అశోక్ కుమార్, కథా, నవలా సినీ రచయిత
పుస్తక సమీక్ష :
డా. బి.వి.ఎన్.స్వామి, కథారచయిత, విమర్శకుడు
ఆత్మీయ అతిథులు :
బూర్ల వేంకటేశ్వర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కవి, రచయిత
అన్నాడి గజేందర్ రెడ్డి, కవి, విమర్శకులు, గాయకులు
కూకట్ల తిరుపతి, సభా సమన్వయం 9949247591
సాహితీ సోపతి కరీంనగర్, తెలంగాణ


# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ : సీఎం రేవంత్

## -కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు ఈవీలకు ప్రాధాన్యం



హైదరాబాద్, జులై 15: తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిచే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్ సమీపంలో అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కీలక కేంద్రంగా మారనుందని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఆధునిక సాంకేతికత, పెట్టుబడులను ఆకర్షించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు.

చైనాతో పోటీ పడే స్థాయిలో అభివృద్ధి వ్యూహాలు రూపొందిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను కొత్త స్థాయికి తీసుకెళ్లడంతో పాటు.. తెలంగాణ అభివృద్ధికి 'క్యూర్, ప్యూర్, రేర్' అనే మూడు ప్రధాన సూత్రాలతో ముందుకు వెళుతున్నామని తెలిపారు.

**అమెజాన్ డేటా సెంటర్‌తో పెట్టుబడులకు ఊతం**

ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఇటీవల అమెజాన్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇది తెలంగాణలోకి మరిన్ని అంతర్జాతీయ పెట్టుబడులు రావడానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు భారీ స్పందన లభించిందని, దాదాపు 3 వేల కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయని చెప్పారు.

తెలంగాణను అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి ఫార్మా కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన విధానాలు అవసరమనే ఉద్దేశంతో ఇప్పటికే టూరిజం, మెడికల్, స్పోర్ట్స్ రంగాల్లో కొత్త పాలసీలను తీసుకొచ్చామని వెల్లడించారు.

హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్ (ఞఖీఖీ) పరిధిలో ప్రస్తుతం కోటి 34 లక్షల మంది జనాభా ఉన్న నేపథ్యంలో.. ఈ ప్రాంతాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మూసీ నది ప్రక్షాళనతో పాటు మెట్రో రైలు విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

**ఈవీల వైపు హైదరాబాద్ అడుగులు**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లోని సుమారు 2 లక్షల డీజిల్ ఆటోలను ఈవీ ఆటోలుగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవీ వాహనాల కొనుగోలుపై జీరో ట్యాక్స్ విధిస్తున్నామని వెల్లడించారు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి కొంత నష్టం వచ్చినా.. నగర భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యం కోసం ఈ నిర్ణయాన్ని కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# వాతావరణం, ఆరోగ్య వ్యవస్థల మధ్య అనుసంధానం కోసం సూత్రా-సీహెచ్




హైదరాబాద్, జులై 15:మల్లా రెడ్డి విశ్వవిద్యాపీఠ్, టారుటియం గ్లోబల్ కన్సల్టింగ్ భాగస్వామ్యంతో హైదరాబాద్ క్యాంపస్‌లో 'సూత్ర-సీహెచ్ తెలంగాణ లీడర్‌షిప్ రౌండ్‌టేబుల్' సమావేశాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పుల వల్ల ఏర్పడుతున్న ఒత్తిళ్లను.. తెలంగాణ ఆరోగ్య వ్యవస్థలు సమర్థంగా ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడి ఒత్తిడి (హీట్ స్ట్రెస్), వాయు కాలుష్యం, నీటి కొరత, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ప్రభావం, అలాగే ఆస్పత్రులు , ప్రజారోగ్య మౌలిక వసతులపై చూపుతున్న ఒత్తిడిపై చర్చ చేపట్టారు.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, క్రీడల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాతావరణ మార్పులు ప్రజారోగ్య ఫలితాలపై పెరుగుతున్న ప్రభావాన్ని చూపుతున్నాయని, ఆరోగ్య వ్యవస్థలపై కొత్త సవాళ్లను విసురుతున్నాయని, ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు, పరిశ్రమల మధ్య మరింత బలమైన సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో హీట్‌వేవ్స్, వాటి ప్రభావం ప్రజారోగ్యం, శ్రామికుల ఉత్పాదకత, ఆరోగ్య సేవలపై ఎలా పడుతోందనే అంశంపై చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు.

సూత్ర-సీహెచ్ ఇనిషియేటివ్‌లో వాతావరణ మార్పులు మరియు ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న సంస్థలను అనుసంధానించాలని, పరిశోధనా భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని, విస్తృత స్థాయిలో అమలు చేయగల ప్రజారోగ్య పరిష్కారాల అభివృద్ధికి తోడ్పడాలని నిర్ణయించారు. క్లైమేట్ అండ్ హెల్త్ ఇన్నోవేషన్ చాలెంజ్ (సీహెచ్ఐసీ) 1.0 లో భాగంగా వాతావరణ మార్పులతో అనుసంధానమైన ప్రజారోగ్య సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్న విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు, ఆరోగ్య నిపుణుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు.

మల్లా రెడ్డి విశ్వవిద్యాపీఠ్ చైర్మన్ డా. భద్రా రెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులు పర్యావరణ సమస్య మాత్రమే కాకుండా ప్రజారోగ్య సమస్యగా కూడా మారాయన్నారు. అభివృద్ధి చెందుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పరిశోధన, ఆవిష్కరణలు, ఆరోగ్య నైపుణ్యం, పరిశ్రమల భాగస్వామ్యాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. సూత్ర-సీహెచ్ వంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్య వ్యవస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేసే, సుస్థిర అభివృద్ధికి తోడ్పడే అర్థవంతమైన భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని అన్నారు. మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్మన్ డా. ప్రీతి రెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల కలిగే ఆరోగ్య ప్రభావాలను ఒక్క సంస్థ మాత్రమే పరిష్కరించలేదన్నారు. విద్యాసంస్థలు, ప్రభుత్వం, ఆరోగ్య సేవల సంస్థలు, పరిశ్రమల మధ్య భాగస్వామ్యాలు అవసరమన్నారు. టారుటియం గ్లోబల్ కన్సల్టింగ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు- ఆరోగ్యంపై జరుగుతున్న చర్చలను కేవలం సంభాషణలకే పరిమితం చేయకుండా, విధానాలు, సాంకేతికత, పరిశోధన, మౌలిక వసతుల రంగాల్లో స్పష్టమైన భాగస్వామ్యాల దిశగా తీసుకెళ్లాలని కోరారు.

# మరో 5 లక్షల టన్నుల స్టోరేజ్ లక్ష్యం!

## -ప్రభుత్వ కార్పొరేషన్ల ఆర్థిక బలోపేతంపై మంత్రి తుమ్మల దృష్టి



హైదరాబాద్, జులై 15: రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా వచ్చే రెండేళ్లలో ప్రస్తుత నిల్వ సామర్థ్యానికి అదనంగా మరో 5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత?జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో గోదాముల సదుపాయం కల్పించడంతో పాటు.. ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన సూచించారు. వడ్డీ భారాన్ని తగ్గించుకుంటూ ఆదాయ మార్గాలను పెంచుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**20 ఏళ్ల అవసరాలపై సమగ్ర అధ్యయనం**

సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్‌ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల పనితీరు, ఆర్థిక పరిస్థితి, గోదాముల వినియోగం, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలు, ఆదాయ వృద్ధి అవకాశాలపై చర్చించారు. జిల్లాల వారీగా రాబోయే 20 సంవత్సరాల గిడ్డంగుల అవసరాలపై ప్రత్యేక అధ్యయనం చేపట్టాలని మంత్రి సూచించారు. దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోదాముల నిర్మాణం చేపట్టాలని, నిల్వ చేసిన సరుకుల నాణ్యతను కాపాడేందుకు శాస్త్రీయ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో ప్రస్తుతం 52 సొంత గోదాములు ఉన్నాయని మంత్రి తెలిపారు. వీటి మొత్తం నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. ప్రస్తుతం గోదాముల్లో 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదై 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, ఇన్వెస్టర్ గోదాములు, అద్దె గోదాములతో కలిపి మొత్తం 524 గోదాములు ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయని తెలిపారు.

రాష్ట్రంలో పెరుగుతున్న వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా గోదాముల సామర్థ్యాన్ని విస్తరిస్తున్నామని మంత్రి వివరించారు. ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. మొదటి దశలో నిర్మిస్తున్న 17 గోదాములను 2027 జనవరి నాటికి పూర్తి చేసి సుమారు 2.12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. రెండో దశలో నిర్మిస్తున్న 31 గోదాములను 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసి మరో 3.66 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచనున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. వీటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

కొత్తగా నిర్మించే ప్రతి గోదాముపై తప్పనిసరిగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గోదాముల అవసరాలకు కావాల్సిన విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు.. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించే విధంగా రెడ్కో సంస్థతో కలిసి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ కార్పొరేషన్లు ఆదాయ వనరులను పెంచుకునేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.

మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, హాకా, వేర్‌హౌసింగ్ వంటి ప్రభుత్వ సంస్థల ఆధీనంలోని గోదాములను సమన్వయంతో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. దీంతో నిర్వహణ వ్యయాలు తగ్గడంతో పాటు ప్రభుత్వ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అవసరం లేకుండా ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకోవడం వల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ముందుగా ప్రభుత్వ సంస్థల ఆధీనంలోని ఖాళీ గోదాములను గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు.

కొత్తగా నిర్మించే గోదాముల పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తుమ్మల సూచించారు. నిర్మాణ పనుల పర్యవేక్షణకు ప్రత్యేక ఇంజనీరింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఆధునిక వేర్‌హౌసింగ్ నమూనాలను అధ్యయనం చేసి ఎక్కువకాలం మన్నికగా ఉండే డిజైన్లను ఎంపిక చేయాలని ఆదేశించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక వేర్‌హౌసింగ్ మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, ప్రభుత్వ కార్పొరేషన్లను ఆర్థికంగా బలోపేతం చేయడం, సాంకేతిక పరిజ్ఞానంతో ఆదాయ వనరులను పెంచడం లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు.. ఐదుగురికి గాయాలు

మెదక్, జులై 15: జిల్లాలోని మనోహరాబాద్ మండల కేంద్రంలోని పరికిబండలో ప్రమాదం జరిగింది. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ నుంచి కమర్షియల్ సిలిండర్‌లోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు సంభవించింది. ప్రమాద తీవ్రతకు గదిలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి.

పేలుడు శబ్దానికి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఐదుగురు బీహార్‌కు చెందిన వలస కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. గాయపడిన వారు రాజేష్, గంగారాం, సంజీవ్, లాలాన్, దబల్ నాథ్‌గా గుర్తించారు.

నిన్న(మంగళవారం) అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. అయితే వంట చేస్తుండగా గ్యాస్ పేలిందంటూ నమ్మించేందుకు అక్కడి వారు ప్రయత్నించారు.

ఈరోజు ఉదయం పోలీసులు వెళ్లి చూడగా అసలు విషయం బయటపడింది. గ్యాస్ అక్రమ దందా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గత ఏడాది కాలంగా స్థానికంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అక్రమంగా గ్యాస్‌ను ఫిల్లింగ్ చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**చురక**

నక్కజిత్తు నటనలా
నడిచే రాజకీయం
నమ్మేస్తే అన్నిటినీ
నమిలేస్తది ఖాయం
పాలక ప్రతిపక్షాల్లో
పైచేయి ఇదే నేడు
ప్రశ్నే ఇక మౌనమైతే
ప్రగతి నిత్యమోడు



-వేల్పుల నారాయణ
9440433475

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com



## అనువాద సూర్యుడు



ఎవరైనా మట్టి లోంచే వస్తారు
కానీ దానిని
సుగంధ భరితం చేసేవారు కొందరే,
నాలుకలు అందరికీ ఉంటాయి
కానీ వాటిని
రసనలుగా మార్చుకునే వారు కొందరే

చేతులు అందరికీ అమరుతాయి
కానీ వాటితో
అరాక్షరాలను తవ్వేవారు కొందరే.

ఒకప్పుడు నలిమెల
ఒక గ్రామం పేరు
ఇవాళ మానేటి నీటిలో దొర్లే
సాలగ్రామమది.


నలిమెల అంటే
బహు భాషల సంగమం లోని మిల మిల
హృదయ కాసారం లోని గలగల.

అతని పేరు భాస్కర్
తెలంగాణాలో బాషా సూర్యుడు
సాత్త్విక భావ శూరుడు.

పుస్తకాలకు కండ్లను
ధారబోసిన వీరుడు.

తరగని ఆర్తి
మౌలిక తత్వానికి
వన్నెతెచ్చిన అమల కీర్తి.

అతడు నా ప్రియమిత్రుడు
నిరంతర జీవన ఛాత్రుడు



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

# అడుగులు ఆగవు... దారులు ముగియవు!

జీవితం అనేది ఒక అద్భుతమైన అభిసారిక. ఈ ప్రయాణంలో మనం వేసే ప్రతి అడుగూ ఒక కొత్త అధ్యాయానికి బంగారు వాకిలి తెరుస్తుంది. మనిషి జననమనే తొలి అడుగు నుండి మరణమనే తుది శ్వాస వరకూ నిరంతరం నడుస్తూనే ఉంటాడు. అయితే, ఈ నడక కేవలం కాళ్ళకు సంబంధించిన శారీరక ప్రక్రియ మాత్రమే కాదు అది మనసు లోతుల్లో సాగే ఒక ఆత్మిక, సామాజిక, భావోద్వేగాల మేళవింపు. మనం స్పృశించే ప్రతి దారీ మనకు ఒక సరికొత్త పాఠం నేర్పుతుంది, కాలంతో పాటు మనల్ని మరింత పరిపక్వుల్ని చేస్తుంది. పెద్దలు తరచూ ఒక ముక్క చెబుతుంటారు, దారి తెలిసిన వాడికి దూరం భయం లేదు అని. కానీ, మ్యాగజైన్ భాషలో చెప్పాలంటే అసలైన లైఫ్ అడ్వెంచర్ ఎక్కడుందో తెలుసా? దారి ఎటో తెలియనప్పుడు కూడా గుండెల్లో ధైర్యం నింపుకుని నిర్భయంగా ముందడుగు వేయడమే! చరిత్ర పుటల్లో నిలిచిన ఏ మహాపురుషుని ప్రయాణాన్ని చూసినా, వారి కెరీర్ లేదా జీవిత మార్గం మొదట్లో పూలబాటగా ఏమీ కనిపించ లేదు. చీకటి అడవుల్లో, అపనమ్మకాల రాళ్ళు రప్పల మధ్య, అనిశ్చితత్వపు మబ్బుల నడుమ వారు నడిచారు. కష్టాలు ఎదురైనా వారు కాళ్ళు వెనక్కి వేయలేదు, అందుకే వారు చరిత్రగా మిగిలారు.

మన జీవితంలో దారి అనే పదానికి రంగురంగుల అర్థాలు ఉన్నాయి. ఒకరికి అది కెరీర్ రేసు కావచ్చు, మరొకరికి అనురాగ బంధాల ప్రేమ మార్గం కావచ్చు, ఇంకొకరికి ఆత్మశోధన చేసుకునే ఆధ్యాత్మిక పంథా కావచ్చు. కానీ ఈ భిన్నమైన దారులన్నీ చివరకు ఒకే ఒక పరమ సత్యం దగ్గరకు చేరుస్తాయి. మనం ఎంచుకున్న దారి మనది, మనం నడిచే స్టైల్ మనది, మనం సృష్టించుకునే డెస్టినేషన్ కూడా మనదే. ఈ స్వేచ్ఛే మానవ జీవితంలో అత్యంత విలువైన వరం. ఒక్కసారి మీ ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళండి. బాల్యంలో అమ్మ చేయి పట్టుకుని నడిచిన ఆ మధురమైన రోజులు గుర్తున్నాయా? ఆ చిరుచేతి స్పర్శలో ఉన్న వెచ్చదనం, ఆ నడకలో ఉన్న అమాయకపు నిర్భీతి అదే నమ్మకం, అదే పాజిటివ్ వైబ్ మనకు జీవితాంతం తోడుండాలి. కాలం మారినా, నమ్మిన మనుషులు దూరమైనా, ఆ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ మనలో అలాగే ఉండిపోవాలి. అప్పుడే జీవితం కలర్‌ఫుల్‌గా మారుతుంది, మనల్ని విజయ తీరాల వైపు నడిపిస్తుంది.

మన తెలుగు సంస్కృతిలో నడవడి అనే మాట చాలా లోతైన, బరువైన అర్థాన్ని కలిగి ఉంటుంది. నడవడి అంటే కేవలం వాకింగ్ స్టైల్ కాదు అది ఒక వ్యక్తి సమాజంలో ప్రవర్తించే తీరును, జీవన విధానాన్ని, ఇతరులతో మెలిగే మర్యాదను సూచిస్తుంది. మన పెద్దలు ఊరికే అనలేదు నడవడి మంచిదైతే నడిచిన దారి కూడా నల్లేరుపై నడకే అవుతుంది అని. ఈనాటి డిజిటల్ యుగంలో మనిషి నడిచే హైవేలు మారిపోయాయి. టెక్నాలజీ విప్లవం, ఆర్థిక మార్పులు, సోషల్ మీడియా పరిణామాలు ఇవన్నీ సరికొత్త వెన్యూలను మన ముందు ఉంచాయి. కానీ, ఈ గ్లోబలైజేషన్ హడావుడిలో కూడా మారనిది, మార్చలేనిది ఒక్కటే ఉంది అదే మానవ హృదయంలో ఉన్న నలుగురికీ మంచి చేయాలనే తపన, ప్రేమించాలనే అభిలాష, ఒక అర్థవంతమైన ముద్ర వేసి వెళ్ళాలనే కోరిక. నడిచే దారి కష్టంగా ఉన్నప్పుడే మనసు ఉక్కులా మారుతుంది, పడిపోయిన చోటే మళ్ళీ లేచే అనంతమైన శక్తి పుట్టుకొస్తుంది.

ఒక చిన్న పిల్లవాడు నడవడం నేర్చుకునేటప్పుడు ఎన్నిసార్లు కింద పడతాడో గమనించారా? పడిన ప్రతిసారీ ఏడుస్తూ కూర్చోకుండా, దుమ్ము దులుపుకుని మళ్ళీ అడుగు వేయడమే వాడు నేర్చిన ఫస్ట్ లెసన్. ఆ పట్టుదలే మనకు లైఫ్‌లో అత్యంత విలువైన అసెట్. మన దేశ చరిత్రను మలుపు తిప్పిన సందర్భాలను చూస్తే మహాత్మా గాంధీ దండి మార్చ్‌లో నడిచినప్పుడు, అది కేవలం కాళ్ళతో వేసిన అడుగులు మాత్రమే కాదు. అది స్వేచ్ఛ వైపు, అణచివేతపై న్యాయం వైపు, భారతీయ మానవ గౌరవం వైపు వేసిన చారిత్రాత్మక ముందడుగులు. అలాగే మన తెలుగు గడ్డపై పుట్టిన మహనీయులను స్మరించుకుంటే పొట్టి శ్రీరాములు గారు ఆ నాడు వేసిన అడుగులు మన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు

చరిత్ర పుటల్లో నిలిచిన ఏ మహాపురుషుని ప్రయాణాన్ని చూసినా, వారి కెరీర్ లేదా జీవిత మార్గం మొదట్లో పూలబాటగా ఏమీ కనిపించలేదు. చీకటి అడవుల్లో, అపనమ్మకాల రాళ్ళు రప్పల మధ్య, అనిశ్చితత్వపు మబ్బుల నడుమ వారు నడిచారు.


కారణమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గారు తన కలం నడిపిన దారి తెలుగు సాహిత్యానికి శాశ్వత వైభవాన్ని తెచ్చింది. విప్లవ శంఖం పూరించిన శ్రీ శ్రీ నడిచిన దారి వేల హృదయాలలో ఆలోచనా రగిల్చింది. వారందరికీ తెలుసు నడిచే దారి ఎంత సవాలుగా ఉంటే, దాని ద్వారా వచ్చే గమ్యం అంత అందంగా ఉంటుందని.

జీవిత ప్రయాణంలో స్మార్ట్‌గా, హ్యాపీగా సాగిపోవడానికి కొన్ని లైఫ్ హాక్స్ ఇక్కడ ఉన్నాయి. కాసేపు రిలాక్స్ అవ్వు, ఎనర్జీ రీఛార్జ్ చేసుకో, కానీ జర్నీ మాత్రం ఆపకు. రాంగ్ రూట్ తీసుకున్నానని సిగ్గుపడకు? కొత్త దారి వెతకడమే అసలైన ఇంటెలిజెన్స్. ఒంటరిగా నడవడం నీ వ్యక్తిగత బలం కావచ్చు, కానీ టీమ్‌గా కలిసి నడవడం ఒక మహాశక్తి. నీ దారిని నువ్వు బోల్డ్‌గా ఎంచుకో, అదే సమయంలో పక్కవాడి దారిని కూడా గౌరవించు. మనం ఎంత దూరం ప్రయాణించామన్నది కాదు, ఎంత హుందాగా, విలువలతో నడిచామన్నదే ముఖ్యం. ప్రకృతిలో ప్రతి దారికీ ఒక యూనిక్ బ్యూటీ ఉంటుంది. వర్షం కురిసిన తర్వాత మట్టి వాసనతో తడిసిన నేల మీద నడిచే ఫీలింగ్, చలికాలంలో మంచు ముసుగేసిన కొండ దారిలో అడుగు వేసే థ్రిల్, ఎండాకాలంలో చెట్ల నీడన దొరికే ప్రశాంతత ఇవన్నీ ఒకే దారి అయినా సీజన్‌ను బట్టి కొత్త వైబ్స్ ఇస్తాయి. జీవితం కూడా అంతే బాస్! ఒక్కో ఏజ్ గ్రూప్‌లో ఒక్కో రుచి, ఒక్కో థ్రిల్ ఉంటుంది. బాల్యంలో కుతూహలం, యౌవనంలో ఎనర్జీ, మిడిల్ ఏజ్‌లో ఒక పక్కా గోల్, వృద్ధాప్యంలో నిండైన జ్ఞానం ఈ నాలుగు దశలూ కలిస్తేనే ఒక పరిపూర్ణమైన జీవన కావ్యం. ఆధునిక కాలంలో మనం స్పీడ్ అనే మాయలో పడి అసలైన నడకను, ఆ ఫీలింగ్‌ను మర్చిపోతున్నాం. కార్లు, మెట్రోలు, ఫ్లైట్లు మనల్ని వేగంగా గమ్యానికి చేరుస్తున్నాయి. కానీ, ఈ ఫాస్ట్ లైఫ్‌లో మనం కోల్పోతున్నది ఏమిటో తెలుసా? ఆ ప్రయాణం మధ్యలో ఉండే అద్భుతమైన ల్యాండ్‌స్కేప్స్, పలకరించే మనుషులు, మనసుకు హత్తుకునే లైఫ్ లెసన్స్! గమ్యం ముఖ్యం అనడంలో సందేహం లేదు, కానీ దారి పొడుగునా లభించే అనుభవాలే జీవితాన్ని నిజంగా రిచ్‌గా మారుస్తాయి. జీవిత మార్గంలో ఒంటరిగా నడవడం ఈజీ కావచ్చు, కానీ తోడుగా ఒక మనసున్న మనిషి నడిచినప్పుడు కలిగే కిక్కే వేరు. కష్టాలు షేర్ చేసుకుంటే తేలికవుతాయి, సంతోషాలు డబుల్ అవుతాయి. పేరెంట్స్, తోబుట్టువులు, బెస్ట్ ఫ్రెండ్స్, లైఫ్ పార్ట్‌నర్ వీరందరూ మన జర్నీని గైడ్ చేసే ఎనర్జీ పిల్లర్స్.

అయితే, ప్రాక్టికల్‌గా ఒక విషయం గుర్తుంచుకోవాలి మన లైఫ్ జర్నీలో తోడు వచ్చే ప్రతి ఒక్కరూ క్లైమాక్స్ వరకు మనతోనే ప్రయాణించలేరు. కొందరు కొంత దూరం వరకే వస్తారు. వారు తమ దారిలో వెళ్ళిపోయినప్పుడు డిప్రెస్ అవ్వకుండా, వారు మనకు అందించిన మంచి జ్ఞాపకాలకు థాంక్స్ చెప్పుకుంటూ ముందుకు సాగిపోవాలి.

సమాజం కోసం నడిచే వ్యక్తి యొక్క అడుగుల చప్పుడు ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. ఉదయాన్నే పొలాల వైపు నడిచే రైతు అడుగులలో దేశం ఆకలి తీర్చే సంకల్పం ఉంటే, హాస్పిటల్ కారిడార్‌లో నడిచే డాక్టర్ అడుగులలో ప్రాణం పోసే కరుణ ఉంటుంది. స్కూల్ వైపు నడిచే టీచర్ అడుగులలో రేపటి తరాన్ని తీర్చిదిద్దే జ్ఞానం ఉంటుంది. ఈ పాజిటివ్ అడుగుల కలయికే ఒక బ్యూటిఫుల్ సొసైటీ! జీవిత మార్గంలో చివరి అడుగు వేసే వరకూ నడవడం ఆపకూడదు ఇదే సక్సెస్‌ఫుల్ లైఫ్ సీక్రెట్. ఒక గమ్యం రీచ్ అవ్వగానే ప్రయాణం ముగిసిపోదు. అక్కడ మరో కొత్త దారి ఓపెన్ అవుతుంది. ఒక శిఖరం అధిరోహిస్తే, అంతకంటే ఎత్తైన మరో శిఖరం మనకు వెల్‌కమ్ చెబుతుంది. జీవితం ఒక అంతులేని ఎండ్‌లెస్ జర్నీ అందులోనే దాని అసలైన అందం దాగి ఉంది. రేపటి సూర్యోదయం మీ కోసం ఒక సరికొత్త దారిని, సరికొత్త అవకాశాలను తెస్తుంది. ఆ దారిలో నడవడానికి మిమ్మల్ని మీరు ఇప్పుడే రీబూట్ చేసుకోండి. మీ అడుగులలో నమ్మకం, మీ హృదయంలో ప్యూర్ లవ్, మీ మైండ్‌లో క్లారిటీ ఉండనీయండి. మీ అంతరాత్మ చెప్పే దారిలోనే నడవండి. ఆ నడకే మీకు అల్టిమేట్ హ్యాపీనెస్‌ను, నిజమైన విజయాన్ని అందిస్తుంది. చివరగా నడిచే దారిలో సాగిపోతూ ఎప్పుడైనా వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, మీరు వేసిన అడుగుల గుర్తులు ఇతరులకు ఒక గైడింగ్ లైట్‌గా మారితే అంతకంటే సాఫల్యం ఏముంటుంది? మీ నడక కేవలం మీకు మాత్రమే కాదు, మీ తర్వాత వచ్చే తరాల వారికి వెలుగు చూపే టార్చ్ లైట్ కావాలి. సో ఫ్రెండ్స్ నడవండి ధైర్యంగా, ప్రేమతో, ఒక పక్కా గోల్‌తో!

సమాజం కోసం నడిచే వ్యక్తి యొక్క అడుగుల చప్పుడు ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. ఉదయాన్నే పొలాల వైపు నడిచే రైతు అడుగులలో దేశం ఆకలి తీర్చే సంకల్పం ఉంటే, హాస్పిటల్ కారిడార్‌లో నడిచే డాక్టర్ అడుగులలో ప్రాణం పోసే కరుణ ఉంటుంది. స్కూల్ వైపు నడిచే టీచర్ అడుగులలో రేపటి తరాన్ని తీర్చిదిద్దే జ్ఞానం ఉంటుంది.



-డా॥సూర్యదేవర రామకృష్ణ
9490754169

## వినాశనకర చూపులతో....

కాఠిన్యపు తలపులకు తలుపులు తెరిచి
హృదినిండా ప్రేమేవున్నదని
కల్లబొల్లి కబుర్లతో
కల్లాకపటం ఎరుగని
మగువల జీవితాలను
చిత్రవధకావించే
మగధీరుల రాజ్యమిపుడు
విషగన్నెరై వికసించింది.

పాలిచ్చే తల్లులలోనూ
కర్కశం ప్రవేశించి
పాలించే తండ్రులనూ
కడతేర్చే రోజులు
రాజ్యమేలుతున్నాయిపుడు.

విషాన్ని హృదయంలో నింపుకొని
వినాశనకర చూపులతో
విషాదాన్ని సృష్టిస్తున్నారెందరో.

ఏ దారీ కానరాక
అలసిసొలసిన మనిషి
తన మనస్సును ఎటూ మళ్ళించలేక
దుఃఖసాగరంలోకి దొర్లించుకుంటున్నాడు.

ఈ లోకాన్ని శుద్ధిచేసి
మానవులలోకి విలువలను
ప్రసరింపచేసే సాధనాన్ని
కృత్రిమమేధ సైతం సృష్టించలేదు
మనిషే తనకు తాను సంస్కరించుకొని
పారేసుకున్న విలువల వలువలను
మళ్ళీ ధరించాలి.

(7-7-26న శ్రీ త్యాగరాయ గానసభ "మానవ విలువలు" అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో చదివిన కవిత.)



-పొత్తూరి సుబ్బారావు
94907 51681


# 'సప్తపది' పద వైభవం

పుస్తక సమీక్ష

ఒక సుప్రసిద్ధ రేడియో ప్రయోక్త. మరో సుప్రసిద్ధ సాహితీవేత్త. ప్రయోక్త మేధలో జనించిన 'సప్తపది' అనే కవితాప్రయోగం. తెలుగు సాహిత్యానికి ఎన్.గోపిగారి 'నానీ'ల సృష్టి తరువాత మరో, సారమయ లఘు కవితా ప్రయోగం. ఆవిర్భవించి మూడేళ్ళయిన 'బుడత' ప్రాయం నాటికే వందలాది కవుల సమాదరణ. **'సప్తపది'** బీజావాపన (Sowing) అయి ముచ్చటగా మూడేళ్ళు గడిచిన, కొద్ది కాలానికే అశేష ఆంధ్ర కవుల సారవంతమైన మస్తిష్కాలలో వ్యాపనం (Dispersal) చెంది వేళ్ళూనుకున్న లఘు కవితా ప్రక్రియ **'సప్తపది',** సృజనకర్త సుధామ. పలువురు సాహితీప్రముఖులు తమ కవితా పటిమను సప్తపదిలో కనబరచటం విశేషం.

ఈ ప్రక్రియ సాహితీ భీష్ములుగా కళారత్నగా, తన పద చిత్ర రామాయణం'లో తెలుగువారి హృదయాలు గెలుచుకున్న కవి, కథ కులు పలు ప్రతిష్టాత్మకమైన పురస్కారాల గ్రహీత జే.యస్. మూర్తి (విహారి)గారి ఆదరణకు పాత్రయై సప్తపదిలో మొట్టమొదటి చారిత్రక కావ్యం "కర్మయోగి". తియ్యని తేట తెలుగు భాష మీద సాధికారం, పద ప్రయోగ వైశిష్ట్యం సమాస పరికల్పనా వైదగ్ధ్యం కావ్య కల్పనా సామర్థ్యం ఈ 'సప్తపది'లోని పద పదానికి కనిపిస్తుంది. ఈ లఘు కవితా కన్యకకు విహారిగారు అద్దిన సొబగులు పూవుకు తావి అబ్బినట్లు శోభిస్తున్నది. బంగారంలో రత్నాలు పొదిగి విలువను ఇబ్బడి ముబ్బడి చేసినట్లున్నది.

జాగృతి పత్రిక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతినందుకున్న 'కర్మయోగి' అన్న కథకు సప్తపది అలంకారమైనది.







**ప్రతులకు:**
జె.ఎస్.మూర్తి (విహారి)
ఫ్లాట్ నెం.103, జె బ్లాక్ (టెర్రా)
రాజపుష్ప ఆశ్రియ, గోల్డెన్ మైల్ రోడ్
కోకాపేట్-హైదరాబాద్-500075
సెల్: 98480 25600

శ్రీ కృష్ణదేవరాయలకు సుమారు 200 ఏళ్ళ పూర్వము నాడు కంపిలిరాయలు. ఆయన ముఖ్య పట్టణం. ఆనెగొంది, ప్రఖ్యాతి గాంచిన హంపి విజయనగరం ప్రక్కన ఆనెగొంది ఉంది. ఒకనాడు కంపిలిరాయలు కొలువు తీరి యుండగా బహదుద్దీన్ అను ముస్లిం తన భార్య కుమారుడితో రాయల వద్దకు వచ్చి శరణువేడుతాడు. బహదుద్దీన్ ఢిల్లీ సుల్తాన్ కొలువులోని అధికారి ఖాజా జహాన్ మేనల్లుడు. సుల్తాన్ ఆగ్రహానికి పాత్రుడై జంబుకేశ్వర రాజు వద్దకు వచ్చాడు.

శరణాగత రక్షణ హిందూధర్మం. అతిబలవంతుడైన ఢిల్లీ రాజుతో తన చర్య, విరోధము, సుల్తాన్ ఆగ్రహ పాత్రము అవుతుందని తెలిసి కూడా జంబుకేశ్వరుడు అభయమిస్తాడు.

ఊహించినట్లుగానే ఢిల్లీ సుల్తాన్ జంబుకేశ్వరరాయలపై దండెత్తుతాడు. సింహ పరక్రమానికి హరణము బలమెంత! జంబుకేశ్వరుడు యుద్ధంలో వీరమరణం చెందుతాడు. రాణులు అగ్ని ప్రవేశం చేస్తారు. విహారిగారు తన 180 సప్త పదులలో జంబుకేశ్వరుని ధర్మనిష్ట పరాయణత, తన ధన, మాన, ప్రాణాలను కూడా లెక్కచేయక ఆశ్రిత జన రక్షణకై కట్టుబడి ఉండటం కర్మయోగి. కావ్యం లోని విశిష్టత. ప్రాస పదాలు: ప్రభువు, విభువు స్వభువు (10వ సప్తది), కడ,ఎడ,ఏరుగడ (12) రక్తి, అనురక్తి,ప్రాణశక్తి (75)- హృదయోల్లాసం గావిస్తాయి. తెక్కలిపాటు (33) విన్నిదనం (43) ఇరుకుపాటు చేటుపాటు (99)లాంటి అంతగా ఆచరణలేని పదాలు పాఠకుని మెదడు మేతలు అవుతాయి. 'తనకే మాలిన ధర్మము మొదలు చెడిన బేరము' అని తెలిసి కూడా, నాటి హిందూరాజుల ధర్మనిరతి, 'ప్రాణ్‌జాఏ, పర్ వచన్ న జాయే' (ప్రాణము పోయినా సరే, మాట తప్పరాదు) అన్న సూక్తికి కట్టుబడటం, నేటి కాలపు రాజనీతికి కొంత ఉద్విగ్నత కలుగచేస్తుంది.



- కూర చిదంబరం
సెల్:8639338675

# గెలుపు
(కథ)



-సుధామ
సెల్:9849297958

"వసంతా... మనిషి జీవితాన్ని అతలాకుతలం చేసేది ప్రేమ కాదు? ప్రేమ తర్వాత మనసు మారడం."

డెబ్బై ఏళ్ల వసుంధర మాట విని వసంత ఒక్కసారి ఆమె వైపు చూసింది.

"ఇంతకాలం తర్వాత ఏం గుర్తొచ్చింది?"

"నా యవ్వనం."

"ఇంకా ఆ రోజులు గుర్తున్నాయా?"

"మర్చిపోవడానికి అవి కలలు కావు? చేసిన తప్పులు."

వసుంధర కాసేపు మౌనంగా ఉండి చెప్పడం మొదలుపెట్టింది.

"డిగ్రీ చదివేటప్పుడు మా కాలేజీలో అరవింద్ అనే అబ్బాయిని ప్రేమించాను. అతడు కవి. నేను కథలు రాసేదాన్ని. పుస్తకాల మధ్య మొదలైన స్నేహం ప్రేమగా మారింది."

"పెళ్లి వరకు వెళ్లిందా?"

"వెళ్లాల్సిందే అనుకున్నాం."

"మరి?"

"ఒక వేసవి సెలవుల్లో మా చిన్నాన్న కొడుకు శేఖర్ విదేశం నుంచి వచ్చాడు."

"అన్నయ్య వరుస కదా?"

"అవును. చిన్నప్పటి నుంచీ 'శేఖర్ 'అనే అనే పిలిచేదాన్ని."

"అయితే?"

"అదే నా జీవితంలో జరిగిన అతి పెద్ద గందరగోళం."

శేఖర్ చదువుకున్నవాడు. మాట్లాడితే విజ్ఞానం. నవ్వితే ఆప్యాయత. ఇంట్లో అందరి బాధ్యతలు తన భుజాలపై వేసుకుని తిరిగేవాడు.

"ఒకరోజు అతను నాతో అన్నాడు?

'వసూ? నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా, నీ జీవితమంతా దానికి నువ్వే బాధ్యత వహించాలి.'

ఆ మాట ఎందుకో నా మనసులో నిలిచిపోయింది.

వసంత ఆసక్తిగా అడిగింది.

"అరవింద్ సంగతి?"

"అతను కలలు కనేవాడు. శేఖర్ జీవితం నిర్మించేవాడు. నేను కలల నుంచి జీవితాన్ని ఎంచుకున్నానని అనుకున్నాను."

"అంటే?"

"వాస్తవికతలో జీవించడానికి కవి అరవింద్ కలల ప్రపంచం తగదు అనిపించింది. అందుకే అతనిని కాదనుకుని అరవింద్‌కు చివరిసారి ఒక ఉత్తరం రాశాను.

'నన్ను మర్చిపో.!అంతే."

"అతను?"

"జవాబు రాసాడు' నీ సుఖమే కోరుకుంటా'నని"

కొన్ని నెలలకే పెద్దలందరినీ ఎదిరించి శేఖర్‌ను నేను పెళ్లి చేసుకున్నాము

ఇంట్లో తుఫాను.

"అతను నీకు అన్నయ్య వరుస!" అని తండ్రి అరిచాడు.

"లోకం నవ్వుతుంది!" అని తల్లి ఏడ్చింది.

"ఇది పెళ్లి కాదు? కుటుంబానికి అవమానం!" అని బంధువులు తీర్పు చెప్పారు.

కానీ నేను వెనక్కి తగ్గలేదు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇద్దరూ పెళ్లి చేసుకున్నాం ఆ రోజు నుంచి రెండు కుటుంబాలు మమ్మల్ని వదిలేశాయి.

సంవత్సరాలు గడిచాయి.

మాకు ఒక కూతురు కూడా పుట్టింది

కానీ బంధువుల మాటలు మాత్రం ఆగలేదు.

"అన్నాచెల్లెల్లా పెరిగిన వాళ్లు పెళ్లి చేసుకున్నారట."

"పిల్లలు బాగుంటారా?"

"వాళ్ల ఇంటికి వెళ్లొద్దు."

నేను బయటకు నవ్వేదాన్ని

రాత్రిళ్లు దిండులో ముఖం దాచుకుని ఏడ్చిన రోజులున్నాయి

ఒకరోజు శేఖర్ అడిగాడు.

"నువ్వు సంతోషంగానే ఉన్నావా?"

"నువ్వు నాతో ఉన్నావు కదా." అన్నాను

కానీ ఆ నవ్వు పూర్తిగా నిజం కాదు.

వసంత మెల్లగా అడిగింది.



"శేఖర్ నిన్ను ప్రేమించేవాడా?"

వసుంధర చిరునవ్వు నవ్వింది.

"మొదటి ప్రేమ మనసునుమాత్రమే గెలుస్తుంది. చివరివరకు నిలిచే ప్రేమ? జీవితాన్నే గెలుస్తుంది. మనం గెలవాల్సింది ఎప్పటికైనా జీవితాన్నే"

"ప్రేమించేవాడు. అంతగా ప్రేమించేవాడు కాబట్టే ఒక ప్రశ్న కూడా ఎప్పుడూ అడగలేదు."

"ఏ ప్రశ్న?"

"'నువ్వు నిజంగా నన్నే ప్రేమించి పెళ్లి చేసుకున్నావా?' అని." వసంత నిశ్శబ్దమైంది.

"అంటే??"

"నేనే సమాధానం చెప్పలేకపోయేదాన్ని."

లోపలికి వెళ్లి ఒక పాత డైరీ తీసుకొచ్చి

వసంతకు చూపాను

"ఇది శేఖర్ చనిపోయిన తర్వాత దొరికింది."

వసంత తెరిచింది.

చివరి పేజీలో

"వసూ?

నువ్వు నన్ను ఎంచుకున్న రోజు గెలిచింది నేను కాదు.

ఓడిపోయింది నీ మొదటి ప్రేమ.

నువ్వు నన్ను ప్రేమించావో, జీవితాన్ని ప్రేమించావో నాకు తెలియదు. కానీ నేను నిన్ను ఒక్కరోజు కూడా ప్రశ్నించలేదు.

ఎందుకంటే నిజమైన ప్రేమ అనేది విశ్వాసం! అది ప్రశ్నలు అడగదు."

వసంత కళ్లలో నీళ్లు.

"నీకు ఇది తెలుసా?"అంది

నెమ్మదిగా తల ఊపాను

"అతనికి ఇంకో విషయం కూడా తెలుసు."

"ఏమిటది?"

"అరవింద్ చనిపోయే ముందు రాసిన చివరి ఉత్తరం? నేను దాచుకున్నానని."

"ఏమన్నావ్?"

"అవును."

అలమారాలో నుంచి మరో కవర్ తీసి వసంతకిచ్చాను. దాన్ని తెరిచింది.

అందులో ఒక్క వాక్యమే ఉంది.

"వసుధా !నువ్వు నన్ను వదిలి వెళ్లిన రోజు ప్రేమ మీద నిజానికి నాకు నమ్మకం పోయింది? కానీ నీ మీద కాదు. లోకాన్ని ఎదిరించి మీ అన్నయ్యనే పెళ్లాడావంటే మీది ఎంతటి ప్రేమో గ్రహించగలిగాను"

వసంత ఆశ్చర్యంతో వసుంధరను చూసింది.

"శేఖర్ ఈ ఉత్తరం చదివాడా?"

"చదివాడు."

"ఏమీ అనలేదా?"

"లేదు."

"ఎందుకు?" కిటికీ బయటికి చూస్తూ మెల్లగా అన్నాను

శేఖర్ తన డైరీలో మరో వాక్యం కూడా రాశాడు చూడు!

వసంత చదివింది.

"ఆమె నన్ను ప్రేమించి పెళ్లి చేసుకుందో లేదో నాకు తెలియదు. కానీ ఆమె జీవితంలో రెండో అవకాశంగా ఉండగలిగాను. కొందరికి మొదటి ప్రేమ దక్కుతుంది. నాకు? ఆమె చివరి శ్వాస వరకు తోడుగా ఉండే అవకాశం దక్కింది. అదే నా విజయం."

వసుంధర కళ్లలో కన్నీళ్లు జారాయి.


"వసుంధరా! ఇప్పుడు నాకు అర్థమైంది." అంది వసంత "ఏమిటి?"అన్నాను

"మొదటి ప్రేమ మనసునుమాత్రమే గెలుస్తుంది. చివరివరకు నిలిచే ప్రేమ? జీవితాన్నే గెలుస్తుంది. మనం గెలవాల్సింది ఎప్పటికైనా జీవితాన్నే"


**అడిగోపుల 1984-2024 మధ్యకాలంలో నలభై ఏళ్ళలో 16 వచన కావ్యాలు ప్రచురించారు. ఒక సంపుటం కథలు రాసినా, ఆయన కవిగానే నిలబడ్డారు. ఆయన శరవేగంతో పరుగెత్తి కవిత్వం రాయలేదు. అట్లని అనూహ్యమైన ఎడబాటును కలిగించలేదు. నిరంతరం నెమ్మదిగా, నిలకడగా కవిత్వం రాశారు.**

# ఆద్యంతం అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నం





-రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
సెల్:9440222117



ఈనెల 19న అడిగోపుల వెంకటరత్నం జయంతి సందర్భంగా...

**"ఎగిరిన ముంగురులపై చెదిరిన కాటుకపై**
**మీన నయనాలపై**
**అధరాల మధురంపై**
**నే కవిత్వం రాయను**
**చచ్చిన శవంపై**
**వెచ్చని కన్నీటిపై కవినై**
**గీతం రాస్తాను**
**నిలబడిపోతాను"**

( సూర్యోదయం:పు.23)

1980 లలో ఇలా తన సంకల్పం చెప్పుకొని, జీవితాంతం దానికనుగుణంగా కవిత్వాచరణ సల్పిన కవి అడిగోపుల వెంకటరత్నం. 1933 లో పుట్టిన తెలుగు అభ్యుదయ కవిత్వ ప్రస్థానంలోకి, 1980 లలో అడుగు పెట్టారు అడిగోపుల. ఆయనను మూడవతరం అభ్యుదయ కవిగా గుర్తించవచ్చు. అడిగోపుల 1984-2024 మధ్యకాలంలో నలభై ఏళ్ళలో 16 వచన కావ్యాలు ప్రచురించారు. ఒక సంపుటం కథలు రాసినా, ఆయన కవిగానే నిలబడ్డారు. ఆయన శరవేగంతో పరుగెత్తి కవిత్వం రాయలేదు. అట్లని అనూహ్యమైన ఎడబాటును కలిగించలేదు. నిరంతరం నెమ్మదిగా, నిలకడగా కవిత్వం రాశారు.

అడిగోపుల 1984లో "సూర్యోదయం "1985 లో" ఎన్నాళ్ళీ చరిత్ర?" అనే కావ్యాలు ప్రచురించారు. ఈ రెండు కావ్యాలలో ఆయన తన అభ్యుదయ కవిత్వ నిర్మాణానికి పునాది వేసుకున్నారు. ఆ తర్వాత రాసిన కావ్యాలలో తన అభ్యుదయ కవిత్వసౌధాన్ని కట్టుకుంటూ వెళ్ళారు.

ఆయన కావ్యప్రచురణ మొదలుపెట్టే నాటికి అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రీయంగా అనేక సంచలనాలు సంభవించాయి. అంతరాతీయంగా రష్యాలో వామపక్ష పాలన ముగియడానికి పరిస్థితులు తయారవుతు న్నాయి. అది 1991 లో కార్యరూపం ధరించింది. జాతీయంగా అత్యవసరపరిస్థితి తర్వాత తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడింది( కొందరు కాంగ్రెస్ వాళ్ళతో కలిసి). రెండున్నరేళ్లకే అది పతనమై మళ్ళీ కాంగ్రెస్ పాలన వచ్చింది. అమృతసర్ ఘటన తర్వాత శ్రీమతి గాంధీ సొంత అంగరక్షకుల చేతిలోనే మరణం చవిచూడబోతున్నారు. ఉత్తరభారతంలో కాన్షీరాం దళిత బహుజన రాజకీయోద్యమం విస్తరిస్తున్నది. రాష్ట్రీయంగా నందమూరి తారక రామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించి తొలి కాంగ్రెసేతర పాలనకు పునాది వేశారు( కొందరు కాంగ్రెస్ వాళ్ళతో కలిసి). తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తుండగా పదిరికుప్పంలో దళితవాడకు ఆధిపత్య కులాల వాళ్ళు అగ్గిపెట్టారు. ఆతర్వాత కారంచేడు దుస్సంఘటనకు సమయం వస్తున్నది. రాయలసీమ వెనుకబాటుతనం మీద రాయలసీమ నాయకులు ఉద్యమానికి ఉద్యుక్తుల వుతున్నారు. తెలంగాణలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు కళాకారులు, రచయితలు, మేధావులు సమాలోచనలు సలుపుతున్నారు. నగ్జల్బరీ ఉద్యమం దందహ్యమాన కల్లోల దశాబ్దం పూర్తి చేసుకుని, ప్రభుత్వ నిషేధానికి రంగం సిద్ధమౌతున్నది. అభ్యుదయ సాహిత్య స్రవంతి కొనసాగుతుండగా, శ్రీకాకుళం, ఉత్తర తెలంగాణల్లో విప్లవోద్యమం మొదలై విరసం ఏర్పడి, విప్లవ సాహిత్యం ఉదృతంగా వస్తున్నది. ఆ సమయానికే అస్తిత్వ వాదాలకు కూడా పునాది పడింది. అంతర్జాతీయ మహిళా దశాబ్దాన్ని అనుసరించి స్త్రీవాదం, కారంచేడు సంఘటన పర్యవసానంగా దళితవాదం మొదలై, వాటి సాహిత్యాలు రాయడం మొదలైంది.

ఈ నేపథ్యంలో అడిగోపుల వెంకటరత్నం తనదైన మార్గంలో కుదురుగా అభ్యుదయ కవిత్వం రాసుకుంటూ వచ్చారు.

అడిగోపుల అభ్యుదయ కవిత్వం నాడి తెలిసిన కవి. ఆ కవిత్వం చరిత్ర తెలిసిన కవి. తాను ఎక్కడ నడక మొదలుపెడుతున్నా రో తెలిసి నడిచిన కవి.

అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజం తాత్విక సిద్ధాంతం. అది సమాజాన్ని వర్గ దృక్పథంతో అర్థం చేసుకుంటుంది. సమాజంలో శ్రామిక, పీడితజనం వైపు నిలుస్తుంది. అభ్యుదయ కవిత్వం భౌతికవాదకవిత్వం. కులమత తత్వాలపై విమర్శ పెట్టుతుంది. శాస్త్రీయ దృక్పథంతో మానవ వాదంతో గతకాలపు అవశేషాలతో యుద్ధం చేస్తుంది. అంతర్జాతీయ దృష్టి కలిగుంటూనే ప్రాదేశిక సామాజిక వాస్తవాలను వస్తువులుగా చేసుకుంటుంది. ప్రజల భాషకు పట్టంగట్టుతుంది. రాజకీయ పార్టీలతో సంబంధం కలిగి ఉన్నా లేకున్నా రాజకీయ దృక్పథం మాత్రం ఉంటుంది. సామాజిక పరివర్తన లక్ష్యంగా కలిగివుంటుంది. సమసమాజం అభ్యుదయ కవిత్వానికి స్వప్నం. వర్గసంఘర్షణ దానికి మార్గంగా ఎంచుకుంటుంది. విమర్శనాత్మక వాస్తవికత అభ్యుదయ కవిత్వ పద్ధతి. శాసన, కార్యనిర్వహణ, న్యాయవ్యవస్థలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది. పాలకుల వలన వచ్చే యుద్ధాలను వ్యతిరేకిస్తూ, ప్రజల ఉద్యమాలను సమర్థిస్తుంది .ప్రపంచ శాంతిని ప్రచారం చేస్తుంది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తుంది. కవిత్వాన్ని గొప్ప ప్రచార సాధనంగా నమ్ముతుంది. వస్తుబలంకలిగుంటూ, ఆ వస్తువుకు తగిన శిల్పం కోసం అన్వేషిస్తుంది. ప్రజల వైపు నిలబడి, ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకుంటుంది.

అడిగోపుల కవిత్వంలో ఈ లక్షణాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దర్శనమిస్తాయి.

**"ధనవంతుడికీ బీదవాడికీ**
**భేదమేమిటన్న మాస్టారికి**
**విద్యార్థి జవాబు"త**
**"ధనవంతుడికి ఆకలయినప్పుడు ఆహారం దొరుకుతుంది.**
**బీదవాడికి ఆహారం దొరికినప్పుడు**
**ఆకలౌతుంది**( సూర్యోదయం:పు.47)

ఇది అడిగోపుల వర్గదృక్పథం.

ఈ దృక్పథంతోనే ఆయన "సూర్యోదయం", "ఎన్నాళ్ళీ చరిత్ర" కావ్యాలలో నింపారు. మనదేశానికి స్వతంత్రం వచ్చి నాలుగు దశాబ్దాలు గడిచిపో తున్నా, హరిత విప్లవం, శ్వేత విప్లవం ముగిసిపోయినా, అభ్యుదయ కవి ఆకలిమీద అనేక కవితలు రాయవలసి రావడం విశేషం. పేదరికం, కాలం, అమ్మ, భారతీయుడు, ఆకలి, ఆకలిరాజ్యం,భయం వంటి కవితలలో అడిగోపుల ఆకలి భారతాన్ని, పేదలభారతాన్ని అనేకకోణాలనుండి ఆవిష్కరించారు.

> **అడిగోపుల వెంకటరత్నం వస్తుప్రధానకవి. భావుకత పల్చగా ఉంటుంది. భావం తీవ్రంగా ఉంటుంది. రాజకీయ కంఠస్వరం బలంగా వినిపిస్తుంది. పాఠకులను భావచిత్రాల బరువుతో బాధించరు.**

**"రాత్రి నాకూ నా కొడుక్కి**
**పెద్ద పోరాటం**
**ఆస్తి పంపకాలు కాదు**
**పంచాయతీ ఎలక్షన్లు కాదు**
**చలికి తట్టుకోను**
**చాలీచాలనిదుప్పటి**
**వాడటులాగ నేనిటులాగ"** ( పైది :పు.1)

ఆకలి- అజీర్ణం- ఈ వర్గవ్యవస్థ ఎల్లకాలం కొనసాగదనీ, పేదల తిరుగుబాటే దానికి సమాధికట్టుతుందనీ అడిగోపుల హెచ్చరించారు.

**"విప్లవం వస్తుంది**
**ఆకలిమంటలు**
**అరచేతుల్లో**
**వెలిగి నప్పుడు"**

( పైది: పు.11) అసమ వ్యవస్థ సమస్యకు ప్రజా ఉద్యమమే పరిష్కారమని అభ్యుదయ కవి అభిప్రాయం.

అభ్యుదయ కవులు రాజకీయ కవులు. వాళ్ళకు రాజకీయాలు అంటరానివికావు. పైగా ఇష్టమైనవి. అభ్యుదయ కవులు స్వాతంత్ర్యోద్యమాన్ని సమర్థించారు. అలాగే తెలంగాణ రైతాంగ పోరాటానికి, జమీందారీ వ్యతిరేక ఉద్యమానికీ మద్దతు నిచ్చారు. వాటిలో కొందరు పాల్గొన్నారు. జైళ్ళపాలయ్యారు. ఆకవులే స్వాతంత్ర్యం వచ్చినాక భారతదేశ పరిణామాలను విమర్శించకుండా వదిలిపెట్టలేదు.

**"నేడు**
**ఇంకో దేశానికి**
**స్వాతంత్ర్యం వచ్చింది**
**భారతదేశానికి సంతోషం కలిగింది**
**ఎందుకంటే అప్పుచేయవచ్చు**( పైది: పు.15) అంటూ

రుణ భారతాన్ని అధిక్షేపించారు అడిగోపుల. భారతీయ పార్లమెంటరీవ్యవస్థ - అంటే శాసనవ్యవస్థ ఎంత పతనమైందో విమర్శించడానికి అభ్యుదయ కవి వెనుకాడలేదు. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి సంకేతమైన ఎన్నికల్లో ధనప్రవాహాన్ని ఆయన విమర్శకు పెట్టారు.

**"నోటు ఓటనుకునే ఎలెక్షను వద్దంటూ**
**ఓటిస్తా, ప్రజల ఆకలి తీర్చమంటాడు ఓటరు.**
**నోటిస్తా, నేడు నీ ఆకలి**
**తీర్చుకోమంటాడు లీడరు** ( పైది:పు.40)

మార్క్సిజానికి గుర్తైన ఎరుపు రంగన్నా, ఎర్రజెండా అన్నా అభ్యుదయ కవి ఉప్పొంగిపోతాడు. ఎర్రజండా మీద కవిత రాయని అభ్యుదయ కవి ఉండడు. అడిగోపుల

**"విప్లవపథం- ఎర్రనిరాత**
**విప్లవం- ఎర్రనిబాట"**

(పైది:పు.44) వంటి వాక్యాలు చాలా రాశారు.

లౌకికవాదులైన అభ్యుదయ కవులకు వేల యేళ్ళుగా మన సమాజంలో వేళ్ళు దించుకొని ఉన్న కులమతధోరణులపట్ల ఎలాంటి ఆమోదం ఉండదు. అస్తిత్వవాదాలు రాకముందు నుండే అభ్యుదయ కవులు వీటిని ఉతికి ఆరేశారు.

**"కులంగాడి బలం లేకుండా**
**బలంగాడి కులం రాకుండా**
**నవసమాజం నిర్మిద్దాం**
**నవలోకానికి పయనిద్దాం**
**కులం మంత్రించిన మత్తు**
**మతం మంత్రించని మత్తు**
**మత్తులు ఏవైనా**
**మత్తు ఒక్కటే**
**ఈ మత్తులమత్తునుండి**
**మనం బయట పడ్డరోజు**
**మరోప్రపంచపు వాకిట్లో**
**వాలుతాం**( పైది:పు.8)అన్ని

నమ్మకం ప్రకటించాడు కవి.

వర్తమాన సమాజంలో కనిపించే దృగ్విషయం ఏదైనా అభ్యుదయ కవి చూపు నుండి తప్పించుకోలేదు. ముఖ్యంగా ప్రజల దైనందిన జీవితాన్ని తాకే సమస్యలను అభ్యుదయ కవి విస్మరించడం సాధ్యంకాదు. అడిగోపుల నిరంతరం ప్రజల నడ్డి విరుస్తున్న అధికధరలమీద తన అభ్యుదయ దృష్టికోణం నుండి నిరసన తెలిపారు. అతిశయోక్తిగా, అధిక్షేపంగా అడిగోపుల రాసిన' అధికధరలు' కవిత 1984 నాటికే కాదు నేటికీ ప్రాసంగికత కలిగి ఉంది.

**"ఇండియన్ ఎయిర్ లైన్స్**
**విమానాల్ని రద్దు చేసింది**
**ఏర్ ఇండియా ఇతర దేశాలకు**
**పో నిరాకరించింది**
**భారత రాష్ట్రపతి భయపడి**
**ప్రయాణం రద్దు చేసుకున్నాడు**
**ఎందుకు? ఎందుకు?......**
**భూమ్మీదనుంచి లేచిన అన్ని వస్తువులఅధికధరలు**
**అత్యంత వేగంగా ఆకాశంలోకి దూసుకు వచ్చాయి...**
అందుకే అందుకే ( పైది: పు.5)

స్వతంత్రభారతదేశాన్ని పట్టిపీడిస్తున్న ఒక రుగ్మత నల్లధనం. అక్రమార్జన. తెల్లధనం తో పోటీపడి నల్లధనం తూకం మించిపోతున్నది. రాజకీయాలను కూడా అదే శాసిస్తున్నది.

**"చీకటిని చిలికితే**
**నల్లధనం దొరుకుతుంది**
**ఆకుల్ని చిలికితే**
**అగ్ని కణం పుడుతుంది**( పైది:పు.17)

అని అడిగోపుల హెచ్చరించారు. అభ్యుదయ కవిగా ఆయన ఆసుపత్రులలో రోగుల మందులో జరిగే అవినీతి మొదలు అనేక రంగాల అవినీతిని, అక్రమార్జనను అసహ్యించుకున్నారు. పాలకులు చేసే ప్రచారార్భాటాన్ని కూడా ఆయన ఉపేక్షించలేదు. కార్యనిర్వహణ వ్యవస్థలో ముఖ్యమైన పోలీస్ విభాగంలో జరిగే అన్యాయాలను అడిగోపుల చాలా సందర్భాల్లో విమర్శించారు. 1984 ప్రాంతంలోనే తెలుగునాట ఊపిరి పోసుకున్న లాకప్ డెత్ ను కూడా ఆయన ఆక్షేపించారు.

> **అభ్యుదయ కవిత్వానికి మార్క్సిజం తాత్విక సిద్ధాంతం. అది సమాజాన్ని వర్గ దృక్పథంతో అర్థం చేసుకుంటుంది.సమాజంలో శ్రామిక, పీడితజనం వైపు నిలుస్తుంది**

**"భారతదేశంలో**
**పోలీస్ లాకప్ కెళ్ళాడా?**
**అయితే బ్రతికి బయట పడనట్లే"** ( పైది: పు.25)

అలాగే ఆరోజులలో భాగల్పూరు జైల్లో ఖైదీల కళ్ళు పీకేసిన సంఘటనను

**"భగల్పూరు ఖైదీల కళ్ళు పీకిన ఘనత మాది"**( పైది: పు.26) అని అధిక్షేపించారు.

వరకట్న సమస్యను, చిరుద్యోగిని ఆయన కవిత్వీకరిం చారు. తెలివైనవాళ్ళను ఉపేక్షిస్తూ అమాయకులను శిక్షించే రాజకీయ వ్యవస్థను గుడ్డి వ్యవస్థగా వర్ణించారు. ఉపాధ్యాయుని "జాతికి వెన్నెముక" గా కీర్తించారు. అలాంటి అధ్యాపకుడు చాలీచాలని జీతంతో ' వంగి వంగి నడుస్తు' న్నారని అధిక్షేపించారు. లౌకిక వాదానికి, శాస్త్రీయ దృక్పథానికీ కేంద్రాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు' సర్వం కులమతాలమయ'మని దెప్పి పొడిచారు.

అభ్యుదయ కవులు లౌకిక వాదులు, భౌతిక వాదులు. ఇది వాళ్ళ ప్రాథమిక లక్షణం. మనిషిని చరిత్ర నిర్మాతగా భావిస్తారు. సమాజంలో మానవాతీత శక్తులు ప్రమేయాన్ని తిరస్కరిస్తారు. మనిషిని భావజాలానికి బానిసను చేసే కర్మ సిద్ధాంతాన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తారు. "సూర్యోదయం" అనే కవిత అడిగోపుల భౌతికవాదానికి తార్కాణం.

**"అదిగో సూర్యుడు ఉదయిస్తున్నాడు**
**కాంతిని కనాలంటే కళ్ళు తెరవాల్సిందే**
**రాళ్ళు పగలాలంటే పిడికిలి బిగించాల్సిందే**
**ఖర్మ సిద్ధాంతం కాల్చాలంటే**
**అగ్గిపుల్ల గీయాల్సిందే"**

(పైది: పు.79)

ఇదీ అభ్యుదయ కవి అడిగోపుల తాత్విక నిబద్ధత.

అభ్యుదయ కవులది చలనస్వభావం. స్తబ్ధ స్వభావం కాదు, చపలస్వభావమూ కాదు. "**కదిలేదీ కదిలించేదీ మునుముందుకు నడిపించేదీ"** అభ్యుదయ కవిత్వం. అభ్యుదయకవులు సమస్యలను ఏకరువు పెట్టి చేతులు దులుపుకోరు. ఇంకా ముందుకు పోయి పరిష్కారాలను అన్వేషిస్తారు. ఇతరేతర కారణాలతో చీలికలైన జనాన్ని అభ్యుదయ కవులు ఐక్యత చేయడానికి పాటుపడతారు." కళ ప్రజల్ని ఐక్యం చేయడానికి కృషి చేస్తుంది'' అన్నారు రష్యన్ సౌందర్య శాస్త్రవేత్త యూరి బోరెవ్. అడిగో పుల సమాజాన్ని మార్చుకోడానికి ప్రజల్ని ఏకం కమ్మన్నారు .ఏ సమస్యకైనా ప్రజల ఐక్య పోరాటాలే పరిష్కారమన్నారు. సామాజిక పరివర్తన కోసం జరిగే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వా ములు కావాలని పిలుపునిచ్చా రు. మొత్తంగా ప్రజలనే ఉద్యమించమన్నారు.

**"ఓ ప్రజలారా!**
**మీరంతా చేతులు కలపండి**
**కలిసి కదలిరండి**
**విప్లవానికి విజయం పలకండి"** (పైది: ను.45)

ఏ వాదానికి చెందిన కవులకైనా ఒక సామాజిక స్వప్నం ఉంటుంది. అభ్యుదయ కవులకు కూడా సామాజికస్వప్నం ఉంది. అది సమసమాజనిర్మాణం. అడిగోపులకు సమసమాజమే స్వప్నం. ఆయన కలల బేహారి కాదు. క్రియాశీల స్వాప్నికుడు. తొలికావ్యమైన "సూర్యోదయం" లోనే దానిని సంకల్పంగా చెప్పుకున్నారు. ఆ తర్వాత కావ్యాలన్నిటిలో దానిని ప్రతిపాదిస్తూ వచ్చారు.

**"మేఘాల వొరిపిడి**
**మెరుపుల వెలుగులు**
**ఆపై చల్లని జల్లులు**
**అలాగే**
**ప్రజల సంఘర్షణ**
**ఆపై సమసమాజ నిర్మాణం"**

( ఎన్నాళ్ళీ చరిత్ర:పు.30)

"ఎన్నాళ్ళీ చరిత్ర ? అనే ప్రశ్న"ఇంకానా ఇకపై చెల్లదు" అన్న శ్రీ శ్రీ అల్టిమేటంకు కొనసాగింపే. సమసమాజం మంచి ఆశయమే అయినా, అది ఊరికే ఆకాశంలోంచి ఊడిపడదనీ, ప్రజలు ఉద్యమించి సాధించుకోవాలనీ బోల్షెవిక్ విప్లవం రుజువు చేసింది. ఇది అభ్యుదయ కవులకు ఆదర్శం. " ఎన్నాళ్ళీ చరిత్ర?" కవితలో అడిగోపుల సామాజిక పరివర్తనకు అడ్డుపడే మతతత్వాన్ని విమర్శకు పెట్టాడు.

**"మతకల్లోలాల మారణహోమం**
**మనిషికి మనిషే వెన్నుపోటై**
**విద్వేషానికి ఆహుతి చేసే**
**కిరాతకుల దురాగతాలు**
**తుదముట్టించే సమయమెప్పుడు?**
**మనసుల వెన్నెల కురిసేదెప్పుడు?**
**ఎప్పుడు? ఎప్పుడు? ఎప్పుడు?**
**నవసమాజం మనకొచ్చినప్పుడు**
**సమసమాజం మనం తెచ్చినపుడు"** ( పైది: పు.12)

తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడానికి బలమైన పునాదులు వేసింది అప్పటికి ముందు ,వెనుకాల కాంగ్రెస్ లోని అంతర్గత వైరుధ్యాలు . అవి కొన్నిసార్లు రాష్ట్రంలో అలజడులు సృష్టించాయి. అధికారం కోసం, ముఖ్యమంత్రుల మార్పిడి కోసం ఆ అలజడులు వచ్చాయని ఆ రోజుల్లో అనుకునే వారు. మతకలహాలు కూడా జరిగాయి. ఆ సందర్భాలను అడిగోపుల "ఎన్నికైన ప్రభుత్వాలను ఎలా పడగొట్టాలో" అని ఎద్దేవా చేసి, అప్పటి నాయకులు పేర్లను ప్రస్తావించడానికి కూడా వెనుకాడలేదు.

1985 నాటికే నగరాల బలుపు మొదలైంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి అంటే కాకులను కొట్టి గద్దలకు చేయడమేనని అర్థమైంది. సంపన్నుల ప్రయోజనాలకోసం పేదలను అదృశ్యం చేసే ప్రక్రియ మొదలైంది.ఈ దుర్మార్గం మీద అభ్యుదయ కవి " ఇదేనా మార్పు?" అని ప్రశ్నించారు. మనం ఇవాళ బుల్డోజర్ సంస్కృతి, హైడ్రా పేర్లు వింటున్నాం. అడిగోపుల నాలుగు దశాబ్దాలనాడే ఈ ప్రైవేటీకరణ దౌర్జన్యాన్ని ప్రదర్శించారు.

**"ఎగిరే తాటాకుల్తో**
**పగిలిన రేకుల్తో**
**వేలకువేలు గుడిసెలేసుకొని**
**కాపురముంటున్న**
**ఆ దీనులగూడెంలో**
**సూర్యుడు, బుల్డోజర్ లు**
**ఒక్కసారే ఉదయిస్తాయి"**( పు.7)

ఆరోజులలో కాంగ్రెస్ ఎన్నికల రాజకీయాలు అభ్యుదయ కవులకు పెద్ద వస్తువు. ఆ రాజకీయాల మీద అడిగోపుల చాలా కవితలు రాశారు. అత్యవసర పరిస్థితి తర్వాత భారతీయ రాజకీయాల్లో ఒక విపరీత పరిణామం వచ్చింది. ఎన్నికల సమయంలో ప్రజలకు అసాధారణమైన హామీలు ఇవ్వడం, ఎన్నికల తర్వాత ఆ హామీలను గాలికొదిలే యడమే ఆ పరిణామం. ఎన్నికలకు ముందు ఇంటింటికీ తిరిగి ఓట్లు వెయ్యి ఉంచుకున్న నాయకులు, ఎన్నికల తర్వాత ప్రజలను తమ చుట్టూ తిట్టుకోవడం అధికమైంది. ఈ తలకిందులు ధోరణి సాహి త్యంలోనూ, సినిమా లలోనూ విమర్శకు గురైంది. అడిగోపుల వాగ్దానం, ఓట్లపం దుగ, రేపటి ఎన్నికలు, అన్ని ఓట్లూ మాకే, ఓటు విలువ వంటి అనేక కవితలలో రాజకీయాల్లోని బాధ్యతారాహిత్యాన్ని ఎండ గట్టారు.

**"ఐదేళ్ళకోసారి**
**ఆపై మధ్యంతరంగా**
**జరిగిన ఎన్నికల్లో**
**వాగ్దానాలు చేస్తూ**
**ముప్పయి ఏడేళ్ళు పాలిస్తూ గడిపారు"**( పైది: పు.21) ఈ రాజకీయ

వాగ్దానాల ద్వంద్వ ప్రవృత్తి అప్పటికన్నా ఇప్పుడు అనూహ్యంగా ముదిరిపోయింది.

> **అభ్యుదయ కవులది చలనస్వ భావం. స్తబ్ధ స్వభావం కాదు, చపలస్వభావమూ కాదు.**

ప్రజలు ఓట్లు వేసి తమ ప్రతినిధులను ఎన్నుకునేది తమ సమస్యల పరిష్కారం కోసం. ప్రజాప్రతినిధి అంటే అర్థం అదే. వాళ్ళు చట్ట సభల్లో ప్రజల తరఫున మాట్లాడాలి.కానీ రాజకీయవాదులు చట్టసభలకు ఎన్నికైన తర్వాత ప్రజల సమస్యలను గాలికొదిలేసి సొంత పనులు చక్కబెట్టుకోవడం అలవాటైపోయింది. ఈ బాధ్యతా రాహిత్యాన్ని కవి ఉపేక్షించలేదు. సభల్లో నోరు తెరవని నాయకులను వాళ్ళ మాటలతోనే అధిక్షేపించారు.

**"పార్లమెంటులో అనేకసార్లు**
**ఆదమరచి నిద్రపోయాక**
**ఆవలిస్తూ నోరు తెరిచా**
**అపోజిషన్ వాళ్ళు మాట్లాడుతుంటే**
**ఆపండాపండని అనేకసార్లు అరిచా"**( పైది: పు.28) అస్పృశ్యత, ఆకలివంటి దైనందిన సమస్యలను అడిగోపుల చాలా కవితలలో ఆలోచనాత్మకంగా కవిత్వీకరించారు.

అడిగోపుల వెంకటరత్నం వస్తుప్రధానకవి. భావుకత పల్చగా ఉంటుంది. భావం తీవ్రంగా ఉంటుంది. రాజకీయ కంఠస్వరం బలంగా వినిపి స్తుంది. పాఠకులను భావ చిత్రాలబరువుతో బాధించరు. ఆయన నిర్భయ రాజకీయ స్వరం.

**"ఎర్రజండా అంటే**
**అరమీటరు గుడ్డ కాదు**
**అనేకమంది వీరులరక్తం"**

(,శైలి: పు.48)

---

## ఇగో నీడలో నిలిచిన బంధం

కథానిక

ఒక చిన్న పట్టణంలో వారు కలుసుకున్నారు.
కులాలు వేరు.. కుటుంబాలు వేరు.. కానీ
మనసులు మాత్రం ఒక్కటయ్యాయి.
ప్రేమకు గీతలు వేయలేమని నమ్మి ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు.
ఆమె చదువుకుని ఉద్యోగం సంపాదించింది.
అతను మాత్రం ప్రయత్నాల్లోనే ఉండిపోయాడు.
జీతం ఆమెది.. గౌరవం ఇద్దరిదీ.. జీవితం సాదాసీదాగా గడిచింది.
కాలం వారిని తల్లిదండ్రుల్ని చేసింది.
రెండు మనసుల కలయికకు
గుర్తుగా పిల్లలు పుట్టారు.
లోటు లేకుండా పెంచారు.
అమ్మ కష్టపడి సంపాదించింది.
నాన్న ప్రేమగా అండగా నిలిచాడు.
ఇంట్లో నవ్వులు ఉండేవి.
పిల్లల చదువులు, పుట్టినరోజులు,
చిన్న చిన్న కలలు..
అన్నీ కలిసి నెరవేర్చుకున్నారు.
కానీ..
ఎప్పుడో ఒక రోజు మాటల్లో తేడా వచ్చింది.
మాటల తేడా మనసుల దూరం అయ్యింది.
మనసుల దూరం ఇగోగా మారింది.
"నేను ఎందుకు?" అన్న ప్రశ్న
"నువ్వే ఎందుకు?" అన్న
సమాధానంగా మారింది.
ఒకరిని ఒకరు చూడటం తగ్గింది.
మాట్లాడటం మానేశారు.
ఒకే ఇంట్లో ఉన్నా
రెండు ప్రపంచాలు అయ్యారు.
పిల్లలు పెద్దయ్యారు.
కూతురు పెళ్లీడుకు వచ్చింది.
ఆమె హృదయం నాన్న వైపు లాగింది.
తండ్రి కూడా
"నా కూతురికి నేనే అండ" అనుకున్నాడు.
కొడుకు మాత్రం అమ్మ చాటు బిడ్డగానే
మిగిలిపోయాడు.
సమాజం ప్రశ్నించింది ..
"ఇంటి పెద్ద ఎవరు?"
"రేపు పెళ్లి సమయంలో తండ్రి స్థానం ఎక్కడ?"
వారికి సమాధానం లేదు.
విడాకులు తీసుకోలేదు.
కలిసి కూడా ఉండలేదు.
అతను తన గౌరవం గురించి ఆలోచించాడు.
"ఇంత బతికి చివరికి గంజి అడుక్కుంటానా?"
అన్న ఇగోతో నిలిచిపోయాడు.
ఆమె తన బాధతో గోడ కట్టుకుంది.
"తిండి బిడ్డకు లోటు లేదు? కానీ దగ్గరికి రావద్దు"
అంది.
కాలం గడిచింది.వయసు పెరిగింది.
పిల్లలు ఎదిగారు.
మనసులు మాత్రం గట్టిపడ్డాయి.
మధ్యవర్తులు వచ్చారు.
సమాజం మాట్లాడింది.
పెద్దలు ప్రయత్నించారు.
ఏదో ఒక రోజు?
ఆమె మనసులో చిన్న మార్పు వచ్చింది.
"దూరంగా కాదు? ఎదురు ఇంట్లో అయినా
ఉండు?" అంది.
శరీరాలు దూరంగా ఉన్నా,
ఇళ్లు ఎదురెదురుగా నిలిచాయి.
అది బంధానికి ముగింపు కాదు.
అది మళ్లీ మొదలయ్యే అవకాశమై ఉండొచ్చు.
పాము తన గుడ్లను తింటుందనే విమర్శలా,
తల్లిదండ్రులు తమ సంతతిని బాధ పెట్టకూడదు.
వయసు పెరిగినంత మాత్రాన బుద్ధి పెరగాలి.
ఇగో కరిగితేనే కుటుంబం నిలుస్తుంది.
ఇప్పుడు ఆ ఇంటి ఎదురెదురుగా
రెండు తలుపులు ఉన్నాయి.
ఒక తలుపు మూసిన ఇగోది.
మరో తలుపు తెరుచుకుంటున్న మనసుది.
రేపు ఏది గెలుస్తుందో కాలమే చెబుతుంది?
కానీ ఆశ మాత్రం ఉంది?
ఒక రోజు వారు మళ్లీ ఒకే గదిలో కూర్చుంటారు.
పిల్లల పెళ్లిళ్లలో పక్కపక్కనే నిలుస్తారు.
"మన తప్పు ఇగో" అని నవ్వుకుంటారు.
బంధం చనిపోలేదు.
అది కేవలం గాయపడింది.మిగతాది?
క్షమ అనే ఔషధం మీద ఆధారపడి ఉంది.

-కె.ఎస్.ఎన్.,
9248793710


---

పుస్తక సమీక్ష

## మంచి మాటలతో 'శ్రీ సాయినాధ శతకము'

సచ్చిదానంద సమర్థ సద్గురు సాయినాధ మహారాజాయ నమః సాయిబాబా వారి దర్శనానికి షిర్డీ వెళ్లాలంటేనే స్వామి వారి పిలుపు రావాల్సిందే అంటూ నమ్ముతారు. అలాంటిది ఏకంగా శ్రీ సాయినాధుడిపై శతకం రాయాలంటే సాయి అనుగ్రహం మెండుగా దండిగా వుండి వుండాలి మన దాసరి శ్రీనాథ్‌గౌడ్‌గారికి. అదుకే ఈ శతకానికి మకుటం, **'సకల సుగుణ ధామ, సాయినాధ'** అంటూ పద్యాల్లో సాయి తత్వాన్ని అద్భుతంగా ఒక సుభాషితాల దొంతరగా అందించారు. చాలా పద్యాలు సుభాషితాల్లాగా వున్నాయి. ధనము యున్న నేమి దానమ్ము చేయక, కూడ బెట్టనేల కుడువకుండ, దాచి దాచి తుదకు దండుగ పాలగు' అంటూ దానధర్మాదులు అవసరంగా చెప్పుకొచ్చారు. మాటలను పొదుపుగా వాడాలనీ, సాటి మనిషిని తెల్సుకుని, నీతిగా వుండాలనీ, అలా లేనప్పుడు వారి మాటలు ఏనాటికీ నిలువ వనీ చెప్పారు. ఆలు మగల మధ్యన అనుమానాలుం డరాద న్నారు. కీచులాడు కోవడం వలన కీడు కలుగుతుందన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకొని ఓర్పుతో ఉండాలంటారు భార్యభర్తలు. భర్త మనసెరిగి భార్య వుండాలంటారు. ఆ విధంగానే తల్లిదండ్రుల మనసెరిగి తనయు డు మసలుకోవాలన్నారు. నీతి లేని వాని నీడను చేరరాదన్నారు. దయాగుణం లేని వారి దరికి చేరకూడదని కూడా చెప్పారు.

నీచుల వద్దకే నీచుడైనవాడు చేరతాడనీ, నీతిగల చోట వాడెప్పుడూ నిలువలేడనీ, పంది బురదనే ఇష్టపడుతుంది గాని, పన్నీరును గాదయా అంటారు శ్రీనాథ్‌గౌడ్‌గారు. గౌడ్‌గారు కవి, రచయిత, జానపద గాయకులు, ధ్వని అనుకరణ కళాకారులు, కాంగో డ్రమ్స్, వాయిద్య కళాకారులు, వ్యాఖ్యాత. ఎన్నో బిరుదులూ, ఎన్నెన్నో సన్మానాలను అందుకున్నారు. సంగీత సాహిత్య సుధా మహిని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు. శ్రీ సాయినాధ శతకము ఒక విధంగా మంచి మాటల పుస్తకమే.




**ప్రతులకు:** దాసరి శ్రీనాథ్‌గౌడ్
1ఎ, 120/20,
ఆర్.ఆర్.నగర్,
తిమ్మాపూర్
మంచిర్యాల జిల్లా.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

# మేమూ–హాలీవుడ్–ఇండియన్ సినిమాలు!



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575

అన్య, విదూ, నేనూ 'సెలవులు అయిపోతున్నాయి.' ఈసారి మనం రకరకాల వాద వివాదాల్లో మునిగిపోయాం. ఏమాత్రం ఎంజాయ్ చేయలేకపోయాం. అందుకని రెండు రోజులు సినిమాలు చూస్తూ గడిపేయాలనుకున్నాం. అయితే మా తాతగారు చెప్పినట్లు క్లాసిక్ సినిమాలు కాదు. హాలీవుడ్ సినిమాలు. మనుషులకు అన్నీ కావాలి కదా! ఆ సినిమాలు చూశాక మాకు కలిగిన ఫీలింగ్స్‌ని ఇప్పుడు మీతో షేర్ చేసుకుంటున్నాం.

నిజానికి అన్ని జానర్ల సినిమాలు చూశాం. యాక్షన్, సైన్స్ ఫిక్షన్, క్రైమ్, ఇలాంటివి. అయితే కామెడీ సినిమాలు కూడా చూడాలనుకున్నాం గానీ ఇంతకంటే కామెడీ సినిమాలు ఏముంటాయి. ఇవే చూద్దాం అంది అన్య.

నిజమే. ఇవి గొప్ప కామెడీ సినిమాలు. ఇందులో పెద్ద పెద్ద హీరోలున్నారు. అందమైన హీరోయిన్లు వున్నారు. అలాగే ఇంకా అందమైన విలన్లు వున్నారు. ఇప్పుడు మేం గమనించిన అంశాలు ఇవి.

ఇదివరకు మాట్లాడితే 'షిట్' అనేవారు. ఇప్పుడా మాట అదృశ్యం అయిపోయింది. దాని చోటులో ఈ తో మొదలయ్యే నాలుగు అక్షరాలు. ఈ పదాన్ని మన ఇండియన్ సినిమా దిగుమతి చేసుకుంది. అన్ని భారతీయ సినిమాల సబ్ టైటిల్స్‌లో ఈ పదం వుంటోంది. మా మిస్టర్ క్లీన్ చెప్పినట్లు న బూతో న వర్తమానం కదా!

అలాగే ఈ సినిమాల్లో మద్యం తాగనిది ఒక్క దృశ్యం కూడా వుండదు. ఆడా మగా అందరూ తాగేస్తూ వుంటారు. అలాగే ధూమపానం లేని సినిమా కూడా వుండదు. కాకపోతే ధూమపానం ఆరోగ్యానికి హానికరం. అది కేన్సర్‌కి దారి తీయును అనే ప్రకటనలు అడుగడుగునా వుంటాయి. మన సినిమాల్లోనూ అంతే కదా. ఒకప్పుడు సిగరెట్లు, ఇప్పుడు సిగార్స్–చుట్టలు ఎవరెంత స్టయిల్‌గా తాగితే అన్ని కలెక్షన్లు.

ఈ సినిమాల్లో మనుషులు ఒక్కసారన్నా హాయిగా ఏడుస్తారేమోనని కాగడాలు పెట్టి వెతికాం. మాకు ఒక్కటీ దొరకలేదు. అలాంటి సినిమాలు అస్సలు వుండవని కాదు. మా దృష్టికి రాలేదంతే.

ఇంకా మన సినిమాల్లో తుపాకులు పేలినా, అయిదారు నిమిషాలు మాట్లాడి తలలు వాల్చేస్తుంటారు. హాలీవుడ్ సినిమాల్లో అలా కాదు. అది తుపాకయినా, ఎ.ఐ. 47 అయినా బుల్లెట్ తగలగానే విరుచుకుని పడిపోతారు. ఒక్క హీరోనో, విలనో ఎన్ని దెబ్బలు తగిలినా, బుల్లెట్లు దిగినా కొన్ని వందలమందిని చంపిన తర్వాత గాని చావడు. అలాగే కొందరు విలన్లు కూడా మళ్ళీ చివరి నిమిషంలో దెయ్యాల్లా లేచి వచ్చి ఆఖరి ప్రయత్నం చేసి పోతారు.

ఇవన్నీ మనం దిగుమతి చేసుకున్నాం. మాకు ఇక్కడ అర్థం కాని విషయాలు వున్నాయి. ఇన్ని వందలు, వేలమంది చనిపోతుంటే అక్కడి పోలీసులు ఏమయ్యారు? ప్రభుత్వాలు ఏమయ్యాయి? ఇవన్నీ ప్రపంచ యుద్ధాలు కాదు కదా. వాటి మీద విచారణలు వుండవా? శిక్షలు వుండవా? కోర్టులు వుండవా?

ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు ఎవరినైనా కాల్చి చంపవచ్చా? మనుషుల ప్రాణాలకు ఏమాత్రం విలువ లేదా? వారికి సెంటిమెంట్లు తక్కువ అంటారు. మన దగ్గర సెంటిమెంట్లు, కుటుంబ సంబంధాలు విదేశాలన్నీ ఆదర్శంగా తీసుకుంటున్నాయి అని చెబుతుంటారు కదా. మరి అక్కడా ఇక్కడా ఈ దుర్మార్గం ఏమిటి? ఇలాంటివాటికి సెన్సార్ వుండదా?




"ఇవన్నీ వినోదానికి అంటారు మేంగో. మాకు భావ స్వేచ్ఛ వుంటుంది అంటారు. లాజిక్కులు అవసరం లేదంటారు. ఇవన్నీ మనుషుల్ని చంపటానికా? ఇంత హింస వినోదమా? అందుకేగా మనుషుల్లో సున్నితత్వం పోయింది. ఇదివరకు ఎవరన్నా చనిపోయారన్నా మనకు దుఃఖం వచ్చేది. హత్యలు చేస్తే ఇది దారుణం, వారికి శిక్షలు పడాలి అనుకునేవాళ్ళం. ఇప్పుడేంటి. నరికేసి, ఆ కత్తులు, ఆ రక్తాలు చూపించి నడిచి వెళుంటారు. అసలు ఇది ఆటవిక రాజ్యాల్లో అయినా జరిగిందా?" అని అన్య బాధగా అంది.

మేం ఇలాంటి సినిమాలు చూసినందుకు బాధపడ్డాం. ముందు కామెడీ అన్నాం కదా. అవును ప్రపంచమంతటా ఇంత క్రూరమైన కామెడీని ప్రజల మీద రుద్దుతున్నారు. ఇకముందు ఇలాంటివి చూడకూడదు అనుకున్నాం. మేం చూడం సరే. మిగతావారు చూస్తుంటారు కదా!

ఆ ప్రభావంతో హంతకులు అవుతారు. దొంగలవుతారు. క్రిమినల్స్ అవుతారు. ఇప్పుడు ఎటు చూసినా పిల్లల్ని కిడ్నాప్ చేస్తున్నారు. అలాగే ఆడపిల్లలను ఎత్తుకుపోతున్నారు. డ్రగ్స్, గంజాయి లాంటి వాటిని అమ్ముతున్నారు. అవి కూడా పిల్లలకి అలవాట్లు చేస్తున్నారు. ఎన్ని వందల మంచి సినిమాలు వచ్చినా, ఎన్ని కాలమ్స్ ఎందరు రాసినా మార్పు వస్తోందా? మనుషులు ఎందుకింతగా మారిపోయారు?

అందరం విచారంలో కూరుకుపోయాం.

××××××

తిరిగి బడులు తెరిచారు. అందరం పుస్తకాల బ్యాగ్‌లు సర్దుకున్నాం. ఉదయాన్నే స్కూల్ బస్సులు వస్తున్నాయి. కొత్త మిత్రులు పరిచయం అవుతున్నారు. మేం ఈ సినిమా ప్రభావం నుండి బయటకు రావటానికి చాలా సమయం పట్టింది. అయినా పూర్తిగా బయటకు రాలేకపోతున్నాం.

మిస్టర్ క్లీన్ పదేపదే ఇలాంటి విషయాల జోలికి మీరు పోవద్దు అని ఎందుకు చెబుతున్నారో అర్థం అవుతోంది. అందుకని కొంతకాలం మేం కేవలం చదువుల మీద మాత్రమే దృష్టి పెడతాం. అలాగే విధ్వంసం మీద కాకుండా ఆనందకరమైన విషయాలను వెతుక్కుంటాం.

ప్రపంచంలో అనేకమంది మంచి మనుషులున్నారు. వారి జీవితం మన ముందు వుంది. వారు చెప్పిన మంచి మాటలు, పాటలున్నాయి. అవి వింటాం. వారిలా వుండటానికి ప్రయత్నం చేస్తాం.

ఇప్పుడు ప్రపంచానికి మేం సందేశాలు ఇవ్వం.

పిల్లలకి మాత్రం గాంధీ తాత చెప్పిన మాటలు గుర్తు చేస్తున్నాం.

"చెడు వినకు–చెడు చూడకు–చెడు మాట్లాడకు" వీటి గురించి తెలుసుకుందాం!

---

# సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

గతము
సతము

కష్టసుఖాలతో సాగే
జీవికకు
మార్పులే
హితము!

**–గన్నోజు పద్మావతి**
పాలమూరు

మక్కువ
తక్కువ

మీరు
వివేకం కోరుకుంటే
వినండి
ఎక్కువ.

**–కె. ఎం. కె. మూర్తి**
సికింద్రాబాద్

నిరోధము
విరోధము

రహదారి వ్యవస్థ
అస్తవ్యస్థమైతే
ప్రయాణానికి
అవరోధము.

**–గోపరాజు వెంకట సూర్యనారాయణ**
హైదరాబాదు.

తావులు
దీవులు

కన్నీళ్ళు
కాపురముండే
కళ్ళకు శుభాలు
ఎండమావులు

**–రాజకుమార్ యస్. రుద్రపాటి**
విశాఖపట్నం

గీతం
సంగీతం

భావాల
తీరంలో
లయలతో
నిత్య వసంతం

**–సరోజ రెబ్బాప్రగడ**
బెంగుళూరు

తరి
సరి

తరుణములో
వానలు
పడకుంటే
పండదు వరి

**–విజయకుమారి ముదిగొండ**
విజయవాడ

రణము
మరణము

చావుపుట్టుక
ప్రతి జీవికి
తప్పని
చక్రభ్రమణము

**– ప్రసాద్ రావు,**
విజయనగరం.

మతము
సమ్మతము

అన్ని మతాలను
గౌరవించడమే
జనావళికి
హితము

**–కపిలవాయి అశోక్ బాబు**
హైదరాబాద్

సిద్ధాంతం
రాద్ధాంతం

జీవితంతో పోరాడి
ఓడిపోయాక
మిగిలేది
వేదాంతం....!!

**–శ్రీమతి భారతీకృష్ణ**
హైదరాబాద్

తెగింపు
కొనసాగింపు

ఆలోచనలకు,
ఆశయాలకు,
ఆచరణలకు
పెట్టకు ముగింపు..

**–ఋష్యశృంగు ఢిల్లేశ్వరరావు(ఋష్యశ్రీ)**
సారవకోట

---

# వర్షమా! వర్షించుమా !!

వర్షమా.. వర్షమా.. వర్షించుమా!
అవనికి హర్షము కలిగించుమా!!
చినుకుల సిరులు కురిపించుమా!
పుడమికి పులకింత కలిగించుమా!!

జలజలా పారేటి జలము నీవమ్మా
గలగలా సాగేటి గంగ నీవమ్మా
వాగుల్లో వంకల్లో ప్రవహించుమా
చెరువులు సరస్సులు నిండించుమా.

రైతులు నాగలితో నమస్కరించేరమ్మా
వడివడిగా ఏరువాక సాగెదరమ్మా
నాగేటి సాల్లల్లో నడయాడవమ్మా
బంగారు పంటలు పండించురమ్మా.

నీకరుణ లేకుంటే మాబతుకులు ఎడారమ్మా
కరువు కాటకాలు తీర్చే కల్పవల్లివి నీవమ్మా
జీవకోటికి దాహాన్ని తీర్చే చల్లని తల్లివమ్మా
అందుకో
మా నీరాజనాలు
అందుకోనవమ్మా



– బూర దేవానందం
8143589789

---

# కణిక




సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
**'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు**



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



## జ్ఞాపకమయ్యింది

గతం చేసిన గాయం
గుండెలో మౌనమై నిలిచింది
కాలం ముందుకు నడిచినా
జ్ఞాపకం వెనక్కి లాగింది.
కన్నీటి చుక్కలు ఆరిపోయినా
బాధ మాత్రం మిగిలిపోయింది
నమ్మిన మనసే నొప్పిస్తే
ఆ గాయం లోతుగా మారింది.
గతాన్ని మార్చ లేమని
జీవితంనెమ్మదిగా నేర్పింది
క్షమించే గుండె ఉన్నచోట
శాంతి చిరునవ్వు పూసింది.
గాయం ఇచ్చిన పాఠమే
మనిషిని మరింత దృఢం చేసింది
గతాన్ని వదిలి ముందడుగు వేస్తే
భవిష్యత్తు బంగారు బాట వేసింది.

–కానుకొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు

## గాయంతోనే గడిపేస్తున్నా

బ్రతుకు పుస్తకంలో
అక్షరాల గాయాలు
గజ్జె కట్టిన కలం కత్తిలా
పదునెక్కి నాటిన విత్తనంలా
పదాలు కొమ్మలై
వటవృక్షపు దేహానికి వేలాడుతున్నాయి.
గతపు కౌగిళ్ళన్నీ
ఇప్పుడు వేదన రాగాలు
కుంచె పట్టి బొమ్మ గీస్తే
గుండె ప్రతిబింబంలా ధ్వనిస్తుంది
కమ్ముకున్న చీకటిలో
కుమ్ముకొస్తున్న వెలుగు
నక్షత్రాల కన్నీటి నదులు
అణువణువు ఆవేదన ఆక్రందనలు
పర్యాయాల పొర్లుదండాలై
శిశిర జ్వాల జోల పాటయ్యింది.
పేలనవ్వు పులుముకున్న మోము
తిరగేస్తున్న పేజీల్లోనే కవళిస్తుంది
నెమరీతల ముడతల్లో నలిగిన నందివర్ధనపు
పరిమళాలు గుప్పుమంటుంటే
మనసుకి హత్తుకున్న అధ్యాయాలు
ప్రేమాలయ పుట్టొడిలో
లాలిస్తున్నంత సుగుణం .
గిట్టని గాలి చరుపులేవో
చెంపలను మొరటుగా తడిమి
కనురెప్పలను గిల్లి
చెదరని గురులతో ఉన్న కనుపాపల
వెనుక తీపి భ్రమలు తొలగిస్తూ
ఎడారి ఎండమావిలో మోడ్చి
అట్టహాసంగా వెకిలింతలు అలంకరిస్తుంది
అంతులేని అగాధంలోకి తోసేసిన
వైనపు సిరి
కనులు తెరిపిస్తూ నిజంలోకి..
మానని గాయాల్లో గుంజిళ్ళు తీస్తూ
గడిచిన కథలోనే నేనింకా ఉన్నానని...
లేపనాలు పూయక నర వొంపులన్నిటిని
కుళ్ళబెడుతున్నానని...
మరకలను శుద్ధి చేసి మరల ఎప్పుడు
పూస్తానో...
ఋతువుల సాయంతో ఈ గుండె వేగాన్ని
మాములు స్థితికి ఏనాటికి తీసుకొస్తానో..
పాత పద్దుల పొద్దుల బాకీ చెల్లింపులకు
లెక్కలేస్తున్న క్షణాల కర్మ శిఖలు.

–కె. వాసవి
గుంటూరు

## కనిపించని గాయాలు

కాయానికి గాయమైతే
కాలమే మాన్పుతుంది
గతం చేసిన
మనసు గాయం
మానాలంటే అనంతకాలం పడుతుంది!!.
బాల్యం నుంచి వార్ధక్యం వరకు
ఎన్నో కఠిన అనుభవాలు
మరెన్నో చేదు జ్ఞాపకాలు
తగిలిన తీవ్ర గాయాలునుంచి
అనుభవపాఠాలు నేర్చుకుంటూ
కాలంతో పాటు ముందుకుపోవడమే మనిషి
విధి!!.
సున్నిత మనస్కుడికి
తగిలిన చోటే గాయాలు మళ్లీ మళ్లీ
తగులుతూ మానని గాయాలై మనసును
పిండేస్తుంటాయి!!.
జీవనయానంలో ఎన్నో ఒడుదుడుకులు
జయాపజయాలు
జయం చూసి పొంగిపోయి అపజయం
చూసి కృంగిపోతూ అది మనసుగాయంగా
మారిపోతుంది!!.
దేహానికైనా మనసుకైనా గాయం తగిలితే
కారేది వెచ్చని కన్నీరే
అదో కనిపించని దివ్యౌషధం!!.
సమాజంలో భౌతికంగా కలిసున్నా
మనసులు కలువక
తరతమ భేదాలు,మనస్పర్థలుఆధిపత్య
పోరాటాలు
కులాల కుమ్ములాటలు
ఈ సమాజమే ఒక గాయాల గని!!.
గతం చేసిన కొన్ని
గాయాలు
విజయతీరాలకు చేర్చే
గేయాలు అవుతాయి
విజయానికి
బాసట అవుతాయి
శిఖరపు అంచులకు చేరుస్తాయి!!.

–పరిమి వెంకట సత్యమూర్తి
9440720324

## గాయం నేర్పే సమతుల్యత

గాయాలను తలచుకొని కుమిలిపోతావా?
లేక గాయాన్ని తగ్గించి ఎదుగుతావా?.
గాయమని తెలుసు...
దాన్ని తగ్గించే ప్రయత్నం కన్నా,
తగిలిన గాయంపైనే మళ్లీ ఇంకో గాయాన్ని
చేసుకుంటావా?.
తెలిసిన వెంటనే, దాన్నే మళ్లీ మళ్లీ
తలచుకోకుండా,
అది నేర్పిన గొప్ప గుణమేంటి అని
ప్రశ్నించుకుంటావా?.
నా లోపల గాయాన్ని జ్ఞానంగా మలిచే
శక్తి ఉందని గ్రహిస్తావా?
గాయం గతానిది...
కానీ ప్రస్తుతంలో ఎందుకు బాధిస్తుంది?
దాన్ని చూసి, చేసిన తప్పులను
సరిదిద్దుకోవమని అర్థం చేసుకుంటావా?
లేక నువ్వు ఒక్కరివే ఈ తప్పు చేశావు,
లేక వేరే వాళ్లు చేశారు అని నిందిస్తావా?
నిందిస్తే అక్కడే ఆగిపోతావు.
"ఈ అనుభవం నాలో కొత్త దారిని
తెరిచింది,
నా జీవితానికి కొత్త నాంది పలికింది" అని
తెలుసుకుంటే,
జీవితాన్ని ఆస్వాదిస్తావు.
గతంలోనే గతించిపోవు...
గతం నుండి పునర్జన్మిస్తావు...
అదే గాయం నేర్పే సమతుల్యత.
గాయాన్ని మోసుకుంటూ జీవించడం
కాదు,
గాయం నేర్పిన గుణంతో జీవించడం.
బాధలో బంధీ కావడం కాదు,
బాధ ద్వారా మరింత బలపడడం.

–శ్రావణి సోమిశెట్టి

---

# కసిరెడ్డిహృదయ రాగాలు

పుస్తక సమీక్ష

"వస్తు, భావ రచనలలో భావమునకు ప్రాధాన్యం ఇచ్చిన కవిత్వం"అని ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి గారు భావ కవిత్వాన్ని నిర్వచించారు. "ఏదో ఒక భావాన్ని ఆధారం చేసుకుని అల్పావకాశంలో పూర్ణంగా రససిద్ధిని చేకూర్చే యత్నమ" ని పంచాజ్ఞుల ఆదినారాయణ శాస్త్రి గారి అభిప్రాయం. శ్రీ శ్రీ ఆలోచన ప్రకారం "కవి హృద యంలో తటిత్తువలె అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతియే భావ కవిత్వం" అని తెలుస్తుంది.

భావ కవిత్వ ప్రధాన లక్షణం అంతర్ముఖత్వం. భావ కవిత్వంలో ఆత్మ సౌందర్యం, గుణ సౌందర్యాలు వర్ణించ బడతాయి. కవి తన అనుభవాలను తెరమరవు లేకుండా వెల్లడిస్తాడు. మనోనేత్రానికి సంబంధించిన ప్రకృతి ఎక్కువగా వర్ణించబడుతుంది. తాను విన్న కన్న ఏ చిన్న సంఘటనైనా కవి హృదయ పూర్వక కవిత్వ రూపంలో బయటకు వస్తుంది. అలౌకికానందానికి పెద్దపీట వేస్తారు.

భావ కవిత్వంలో 1.ప్రణయ కవిత్వం 2.ప్రకృతి కవిత్వం 3.భక్తి కవిత్వం 4.దేశభక్తి కవిత్వం 5. సంఘ సంస్కరణ కవిత్వం 6.స్మృతి కావ్యాలు అని ఆరు శాఖలుగా స్థూలంగా విభజించవచ్చు. కసిరెడ్డి జలంధర్ రెడ్డి "ప్రేమ రాగాలు" కావ్యంలోని కవితలు స్వచ్ఛంద ప్రణయం, పూర్వరాగం, సంయోగదశ, ఆశా భంగం విప్రలంభ విశాద స్థితికి సంబంధించినవి. ప్రణయ కవిత్వ రచనకు వయసుకు సంబంధం లేదని కసిరెడ్డి జలందర్ రెడ్డి గారి ప్రేమ రాగాలు కావ్యంతో మరొకసారి నిరూపించబడింది. వృద్ధాప్యం దేహానికి మాత్రమే, మనసుకు కాదన్న నిజం నిరూపితమైంది. 81 ఏళ్ళ వయసులో ఇంత చక్కని ప్రణయ కవిత్వాన్ని అందించిన కవి కసిరెడ్డి జలంధర్ రెడ్డి గారిని అభినందించి తీరాలి.

"మమత మూర్తిగ నాలో
మనసు మాత్రము నిలిపి
చేరవచ్చి ప్రేమ పల్కులాడి
నా ఉల్లము చల్ల జేయవే" అంటూ ప్రేయసి సాన్నిధ్యాన్ని "ఉండవే చెలీ" కవితలో కోరుకున్నాడు.

**"నా ప్రతి సంతోషం**
**నీ నవ్వుల నాదంలోనే**
**ముడిపడి ఉంది"** ఇక్కడ నవ్వుల నాదం సరికొత్త పద ప్రయోగం.

**"నీ ముఖ పద్మమున సంచరించు**
**గండు తుమ్మెదలు గడుసువి**
**నీ అధరామృతమును**
**గోముగా పీల్చి**
**ఎంగిలించగలవు**
**ఆ మధు పాత్రలు నావి**
**అన్యాక్రాంతము చేయకు"** అంటూ "నీ సాక్షిగా" కవితలో ప్రేయసిని అభ్యర్థిస్తాడు.

**"లేనిపోని అనుమానాలకు తావిస్తే**
**బ్రతుకంతా ఏడబాటు**
**తగని మాటలు వింటే**
**తీరని తడబాటు"** అంటూ నేస్తానికి ఆత్మీయంగా హెచ్చరించినది. భార్యాభర్తల మధ్య, ప్రేయసి ప్రియుల మధ్య అనుమానాలకు తావుండకూడదు. చెప్పుడు మాటలు తలవొగ్గితే ఒంటరితనమే మిగులుతుందని చక్కని మార్గనిర్దేశనం చేసిన కవిత"నెయ్యపు కినుక"



ప్రతులకు:
కసిరెడ్డి జలంధర్ రెడ్డి
సెల్:9603499248



**"నిద్రకు దూరం చేసిన నా కలల రాణి"** అని సంబోధిస్తూ

**"ఉదయపు ఆకృతి సోయగాలను**
**పొదువుకున్న పొంకము నీదం"** టూ
**"నా హృదయ గదిలో ప్రేమ పాన్పును**
**పరిచినాను**
**ఒకే దేహమై ఒకే ప్రాణమై**
**నీ సౌందర్య సాగరంలో కరిగిపోదా**
**మం"**టూ స్వప్న సుందరికి ఆహ్వానం పలుకుతాడు.

**"కనుల చలమల్లో సముద్రాలు**
**ఊరుతున్నాయి**
**చెదిరిపోయిన జీవిత జ్ఞాపకాలు**
**ఒక్కొక్కటిగా మనసు జల్లెడ నుండి**
**రాలిపోగా**

> భావ కవిత్వ ప్రధాన లక్షణం అంతర్ముఖత్వం. భావ కవిత్వంలో ఆత్మ సౌందర్యం, గుణ సౌందర్యాలు వర్ణించ బడతాయి. కవి తన అనుభవాలను తెరమరవు లేకుండా వెల్లడిస్తాడు. మనోనేత్రానికి సంబంధించిన ప్రకృతి ఎక్కువగా వర్ణించబడుతుంది. తాను విన్న కన్న ఏ చిన్న సంఘటనైనా కవి హృదయ పూర్వక కవిత్వ రూపంలో బయటకు వస్తుంది. అలౌకికానందానికి పెద్దపీట వేస్తారు.

**పెదాలపై ఓ నిర్జీవ చిరునవ్వు"**

అనుకోకుండా దూరమైన చెలికాడిని తలుచుకుంటూ ఆవేదనని అక్షరాల్లో మలచిన కవిత "దుఃఖ పునీత".

మరో కవిత "మౌనం పోరాటం" లో **"అవరోధాలను అధిగమించి పెల్లుబికే వెల్లువలా**
**నీ జ్ఞాపకాల జడి మదినిండా ఆవరిస్తే**
**దుఃఖము కట్టలు తెంచుకొని**
**నిద్రలేమి నిశీధులు**
**నాతో సహవాసము చేస్తున్నాయి**
**శ్వాస బతికున్నట్టే కాని**
**ఎక్కడో గల్లంతయినట్టుగానే వుంటుంది"**
**"గమ్యం చేరని కల"**లో..
**"మౌనం ఒక విషాద పాత్రగా**
**ఈ భగ్న ప్రేమికుడు ఎప్పటికీ**
**నిట్టూర్పుల లబ్దంతో**
**శూన్యశేషమై మిగిలిపోతాడు"**

నిద్రలేమి నిశీధులు,సముద్రాలు ఊరుతున్నాయి,నిట్టూర్పుల లబ్దంతో లాంటి పద ప్రయోగాలు ఈ కావ్యంలో అనేకంగా అగుపిస్తాయి. సందర్భోచిత సరికొత్త పద ప్రయోగాలు ప్రయోగాత్మకంగా తమ కవితల్లో పొందు పరిచిన విధానం అభినందనీయం.. ప్రశంసాపాత్రం. అంతే కాదు...కొన్ని కొత్త ఆలోచనలకు,ఊహలకు పాదుకొలిపిన సందర్భాలు కూడా ఉన్నాయి."రాగ హృదయం' 'కవితలో...

**"ప్రేమకు రెండు గుండెలే ఉంటే ఎంత బాగుండేది**
**ప్రేమ విఫలమై ఒక గుండె ఛిద్రమైనా**
**బతకడంలో ఏ బాధ లేదు"**

మరొక చెప్పుకోదగిన అంశం... కొన్ని వాస్తవాలను, స్టేట్మెంట్లుగా కవితల్లో చొప్పించారు.

**"కష్టం కూడా ఒక మంచి నేస్తమే"**
**"ప్రేమలు కూడా అప్పుడప్పుడు**
**ఎండమావుల్లా**
**చిత్తాన్ని భ్రమింపజేస్తాయి"**
**"గుండెలో గూడు కట్టుకున్న వెతలను**
**కొందరు దుఃఖాశ్రువులతో వెల్లడిస్తే**
**కొందరు లేత నవ్వులతో కప్పేస్తుంటారు"**
**"ప్రేమ భావోద్వేగ అంశమే అయినా**
**జీవం తొణకిసలాడే బీజం"**
**"వియోగం ఒక మధుర కావ్యం**
**సంయోగం రససిద్ధయోగం"**
**"నిద్రించిన వాళ్లంతా పసిపాపలే"**
**"హృదయం నిర్మలమైనదైతే**
**పంచభూతాలన్నీ సహకరిస్తాయి"**
**"ప్రేమ లేకుండా అంకిత భావం**
**అసంభవం"**
**"అబల జీవితమే**
**సుఖదుఃఖాల సంఘర్షణ"**
**"ప్రేమించడం నేరం కాదు**
**అదొక మధుర స్వప్నం"**
**"మన కోసం మనమే**
**జీవనదిలా ప్రవహిస్తూ జీవించాలి "**
**"జీవనమెప్పుడు పున్నమిలా ఉండదు"**

ఇంక ఈ కావ్యంలోని కొన్ని పంక్తులు మనల్ని వెంటాడుతుంటై..మనసును తడి చేస్తాయి ...గుండె లోతుల్ని తడుముతాయి.

**"నాలోని వ్యధ ... తడి యారని దుఃఖ గీతమై ప్రతిధ్వనిస్తుంది."**

**దాగని దుఃఖపు తెరలు/ఎవరితోనూ పంచుకోలేని /దించుకోలేని దిగులు భారం /కనిపించని బాధల పల్లవి"**

**"ఈ ఎడబాటుతనం /నాలో ఎప్పటికీ ఆరని దావానలం"**

**"తనకు మాత్రమే వినిపించే /క్షతగాత్ర సంగీతమేదో /అలపిస్తూనే ఉంది"**

**"నేను కన్నీటి బిందువునే కాదు/ఓ శోక సముద్రాన్ని కూడా "**

ప్రేయసీ ప్రియుల మధుర ఊహలు,ఇరువురు ఒకరికొకరు చెప్పుకున్న ప్రణయ విరహపు ఊసులు,దూరమైన సందర్భంలో కలిగిన ఎడబాటులో ఉత్పన్నమైన భావోద్వేగపు భావనలు, విషాదపు నీడల్లో పురివిప్పిన విస్తృత గాయాలు , ప్రేమ జ్ఞాపకాల సముద్రంలో తడిసి ముద్దైన తుఫానులు ఈ ప్రేమ రాగాలు. మరి మీరూ విహరించండి .. ప్రేమరాగాలలో ఒక రాగమై మమేకం కండి.




– డా. వైరాగ్యం ప్రభాకర్
9014559059

---

# బహుముఖ ప్రజ్ఞాశాలి కూరెళ్ల శ్రీనివాస్

## –తెలుగు వర్సిటీలో ఐదు పుస్తకాల ఆవిష్కరణ




పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, జులై 15: ఉపాధ్యాయుడిగా, చిత్రకారుడిగా తనదైన పాత్ర పోషించిన బహుముఖ ప్రజ్ఞాశాలి కూరెళ్ల శ్రీనివాస్ అని వక్తలు అభివర్ణించారు. ఆదివారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కూరెళ్ల శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రాలతో కూడిన రచనలు ఐదు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. డా॥ఎస్. రఘు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి డా॥ఎన్.గోపి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా॥ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ జి.వి.శ్యాం ప్రసాద్ లాల్ ఐఏఎస్ ప్రొ॥టి.టి.గంగాధర్, మణికొండ వేదకుమార్ తదితరులు హాజరై కళా శ్రీనివాసమ్, జలవర్ణ జీవ చిత్రం, కూరెళ్ల రేఖా చిత్రాలు, చిత్రధ్వని, ముఖ చిత్రం అనే పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం చేస్తూ సందేశాత్మక చిత్రాలను వేయడం గొప్ప విషయమన్నారు. ఒకేసారి ఐదు పుస్తకాలను ఆవిష్కరింపజేసుకోవడం అభినందనీయమని అన్నారు. కూరెళ్ళ కలం నుంచి జాలువారిన చిత్రాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. శేష జీవితంలో కూడా మరిన్ని చిత్రాలను వేయాలని ఆకాంక్షించారు. సమాజాన్ని చైతన్యపరిచే రచనలు. చిత్రాలు రావాల్సిన అవసరముందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సినీ విమర్శకుడు పొన్నం రవిచంద్ర, కార్టూనిస్ట్ శంకర్, కంభాలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1816వ రోజు **'అత్తా ఒకింటి కోడలే!'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'అత్తా ఒకింటి కోడలే!'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839

## ఆది పదం ....అత్త

ప్రతి శిశువు నోట పలికేది
ఆది పదం ... అత్త అత్త ...
అనుకుంటే కూడా అవుతుంది
ఆర్తిగా మన మనసులో అత్తను అమ్మగా.
అనుబంధాల తీగలో
అత్తది అద్వితీయమైన పాత్ర
అవిభాజ్యాలలో అత్తలంతా
అనుభవాలను ప్రోది చేసుకుని
ప్రసాదంలా కోడళ్లకు పంచి
కనిపెట్టుకున్న దాఖలాలే.
పారిశ్రామికతలో పరుగు
పందెం లంఘించుకున్నాక
చిన్న చిన్న కుటుంబాలై...
ఎవరికీ వారే యమునా తీరే అయింది
అహం బ్రహ్మస్మిలా కొందరిలో
కొరివి దయ్యంలా బ్రహ్మ రాక్షసిలా
మరికొందరేమో మౌనమునిలా
ఆశీర్వదించి క్షేమం కోరుకుంటారు.
మంచి కొంచం మెల్లగా నడుస్తుంది
చెడు జోరుగా అంటుకుంటుంది ...
అపవాదుగా మారింది కానీ
అందరూ అలా ఉండరు.

**-నగునూరి రాజన్న**

## కాలం చెల్లే!

అత్తలేని కోడలుత్తమురాలు
కోడలు లేని అత్త గుణవంతురాలు
అత్త పేరే పెట్టి కూతురిని తిట్టి కొట్టే
అత్త మిత్తి కోడలు కత్తి
సామెతలకు తిలోదకాలు!.
అమ్మ అవ్వలకాలంలో
గంపెడుపిల్లలు
వంటావార్పుతో
అత్తా కోడళ్లు తోడికోడళ్లు
పెత్తనం కోసం
జుట్లు పట్టుకు
జట్టుగా దాడులు
ఇద్దరికీ నోటిదురుసు
అహం ఉంటే
అత్త కు ఒక్కడే కొడుకైతే
మగాడు బలి
ఇద్దరి మధ్య శాండ్ విచ్!.
కొరకొర చూపుల అత్త
కోరచూపుల విసురుల కోడలు
భర్త మామగారు తల దూర్చక
చెవిలో వేళ్లు దూర్చుకుని
టి.వి. పేపర్లలో తలదూర్చితే
మనవల వల్ల కుదురు సంధి.
నేడు విడికాపురం
వీడియో కాల్స్ తో పలకరింపులు
కోడలిగా ఆరళ్లు అనుభవించిన అత్త
నేడుతల్లిగా ప్రేమించు కోడలిని.
తరాల అంతరాలతో సామెత మాయం
నేడు కోడలే వేస్తూ గాలం
తిప్పుతోంది వాలం!
ఆనాడు కోడలిగా చాకిరీ
నేడు అత్తగా
కానరాని మానసిక ఒంటరితనంతో.
అత్త వాట్సప్ తో రచనలు
కాలక్షేపం కోడలు
లాప్ టాప్ తో సంసారం
భవిష్యత్తులో ఆడాళ్లే అన్నిటా
ఇంట బైట పెత్తనాలు
ఒంటరి వృద్ధులకు
పొట్టనింపితే చాలు,
ఒకరు చేసే పనుల్లో
ఇంకోరు వేలెట్టి పుల్లలు పెట్టే
ఇరుగుపొరుగుతో తంటాలు
మగాడు జోక్యంతో బలి
మౌనంతో అవుతాడు బాహుబలి.

**-ఎ.రాజ్యశ్రీ**

## అవును నిజమే

ఏ అత్తా
ఏ కోడలూ
ఎవరూ చెడ్డవాళ్ళు కానేకాదు.
అవగాహన లోపంతో
అర్థం చేసుకోలేక విరోధం
చెప్పుడు మాటలను
చెవిలో నింపుకొని
బద్ద శత్రువులవుతున్నారు.
ఆధిపత్యం కోసం అత్త
అధికారం కోసం కోడలు
ఇద్దరికీ కావలిసింది అదే
ఈ ఇద్దరి పోరులో కుటుంబ
సంరక్షణ మర్చిపోతున్నారు.
బాధ్యత తెలిసిన అత్తాకోడలు
ఎవరు కుటుంబభారాన్ని
మోయగలరో గమనించి
చిన్న పెద్ద తేడా లేకుండా
సర్దుకొని పోయి
అధికారం స్వీకరిస్తే
ప్రతి కుటుంబ వ్యవస్థ బాగుంటుంది.
అత్త అనే పదం
ప్రతిమనిషి పిలిచే
మొదటి పిలుపు
అత్తా ఒకనాటి కోడలే
ఆనాటి నుండి వస్తున్న ఆనవాయితే.
ఎంత ప్రేమగా చూసుకున్నా
అర్థం చేసుకోకపోతే
అత్త అమ్మ కాలేదు
ఎంత సేవ చేసినా
అణకువగా లేక పోతే
కోడలు కూతురు కాలేదు.
ఏదేమైనా ఇద్దరూ ఎన్ని అనుకున్నా
కలిసి కలుపుకొని పోతేనే
కుటుంబం కుదురుగా ఉంటుంది
అవును నిజమే..
అత్త కూడా ఒకనాటి కోడలే.

**-పొన్నాల ధనమ్మ**

## నేటి అత్త

యథార్థం చెప్పాలంటే
అత్త, అమ్మ ఒకటి కారు
కానీ అవగలరు!
మొట్టమొదట పలకగలిగే పదం 'అత్త'
అయినా అమ్మతో అనుబంధం
ఆజన్మాంతం
పేగులో పేగైన కూతురు
మనసులో ఏముందో
అమ్మకి బాగా తెలుస్తుంది,
తన అస్తిత్వానికి, వ్యక్తిత్వానికి
కారణమైన తల్లితో
కూతురు మనసు విప్పి
మాటాడగలదు.
ఎవరికీ చెప్పుకోలేని సంగతులను
తల్లీ కూతుళ్ళు
పరస్పరం పంచుకోగలరు,
తల్లీ కూతుళ్ళలో
ఒకరికి బాధ కలిగితే
మరొకరికి గుండెలో కలుక్కుమంటుంది
తల్లీ తనయల బొడ్డు తాడు బంధం
కడదాకా నిలిచేది.
ఇదే భావన
కొడుకులు, కూతుళ్ళు
ఇరువురికీ వర్తిస్తుందనేది సత్యం
తల్లీ తనయుల అనుబంధం
అనిర్వచనీయం.
ఇరువంకల అమ్మా
కోరుకునేది
దంపతుల సంతోషమే,
ఈ జీవనసత్యాన్ని గ్రహిస్తే
యువతీయువకులకు తెలుస్తుంది
ఇద్దరి సమానత్వం.
"అత్త ఉన్న కోడలే ఉత్తమురాలు"
అనేదే నేటి జీవనగీతం
మంచి, చెడు మనస్తత్వాలు
నాడూ నేడూ ఉన్నాయి,
అధికాతిఅధికంగా
నేటి అత్త
కోడలి కష్టసుఖాలు తెలుసుకుంటుంది.
వివాహానంతర జీవితంలో
అత్త మాతృసమానురాలని
గుర్తిస్తోంది ఈనాటి పడతి
వృత్తి ప్రవృత్తుల్లో
నవీన యుగపు అత్తా కోడళ్ళు
ఒకరికిఒకరు తోడు.
నేటి అత్తా కోడళ్ళు
ఇంటా బయటా
విడిపోని స్నేహితురాళ్ళు
అత్తా అల్లుళ్ళు
తల్లీ కొడుకుల్లా
మసలుకుంటున్నారు.
ఉమ్మడి కుటుంబపు విలువలు
జవజీవాలనందుకొని
పునర్వికాసాన్ని పొందుతున్నాయి,
అందుకే అంటున్నాను
నేడు అందరి మనసుల్లో, ఇళ్ళల్లో
అత్త, అమ్మ ఒకటే!.

**-ముద్దు వెంకటలక్ష్మి**

## అత్తో..నువ్వా ఒకప్పుడు కోడలేనట!

అత్త, కోడలు
ముచ్చటైన
ఒకే ఇంటి జంట పంట.
వంట అందులోనే
ఉందంటారా తంటా!?.
అత్త ముందు వస్తే
వెనకాల కోడలు.
ఇద్దరిదీ ఒకే జాతి
గోతి(స్త్రీ) జాతి.
కోతి కాదండోయ్.
గోతి అంటే ఆడమనిషి.
అదేం ప్రారబ్ధమో
సజాతీయులకే జగడాలు, ఆగడాలు.
అన్నట్లు చెప్పడం మరిచా.
ఆడపిల్లకు అమ్మపెట్టే చీవాట్లు
వేడివేడి పెసరట్లు.
అత్తచెప్పే చిన్నమాట
అబ్బా కత్తిపోట్లు.
అత్త కూడా
ఓ ఆడపిల్లకు అమ్మే.
ఆమెది ఇదే తతంగం.
అబ్బాయికి ఇటుపక్క అమ్మ
అటుపక్క ఆలీ
అదే అసలు చిక్కు
వాళ్ళిద్దరూ
తమ మధ్యలో ప్రాణిపై
"నా హక్కు అంటె నా హక్కు" అని
మనసులో పీకులాట.
దాంతో "నాకేం తక్కువ"
అని ఒక ప్రాణి అనుకొంటే
"నేనే ఎక్కువ" అని
లా పాయింటులాగుతుంది
సెకండ్ గోతి
వాళ్ళని సర్దడానికి
వారి మధ్య సయోధ్య కుదర్చడానికి
సదా శివునికి కూడా సాధ్యం కాదేమో!.
అత్తఒకనాటి కోడలై పడ్డ కష్టాలు
లెక్కలు కట్టి మరీ కోడల్ని తానుపెట్టే
కష్టాలేమి లేనట్టే
తాను పరమ సాధ్వీననే భావన.
కటకటా... అకటా!
ఆ కష్టాలే కటకటాల వెనకే
ఉన్నంత బాధపె డుతున్నాయి
పాపం కోడలు గారిని.
అందుకే అత్తా కోడళ్ళ కష్టాలు
అవి కలకాలం వర్ధిల్లు గాక అని
ఎవరో పెట్టిన శాపాలు.
గాలి ఎప్పుడూ ఒకే వైపు వీచదుగా
అత్తల గాలి ఆగింది
కోడళ్ల హవా జోరుగా హుషారుగా
సాగుతున్నట్టు వార్తలు.
కోడలు ఒకనాటికి అత్త
అవుతుందిలే అని అత్త దీవెన, భావన.
ఈ చక్రం
ఇలా తిరుగుతూ ఉండాల్సిందేనా?
మానవత్వం మేలుకోదా?అని
జవాబు లేని ప్రశ్న
నాలో తళుక్కుమన్నది.

**-డా.సి.వసుంధర**

## సహజ స్వభావం!

ఇగో పొగ ఇద్దరిలో
అహంకార ఆధిపత్యంతో
తనుకూడా ఒకనాటి కోడలేనని
మరిచిన పోరాటం
నవ మాసాలూ మోసి
పెంచిన కొడుకుపై
నాకే హక్కనే దర్పం
కోడలి కొంగు పట్టుకుని
చేజారిపోతాడనే
మనసులను ఆక్రమించిన భయం
అభయం లేని ఆశ్రయం
అత్త తాను పడ్డ
ఆనాటి కష్టాలు
చాలా ఎక్కువని
సాధింపులు లెక్కలు కడుతుంది
ఇద్దరి మధ్యా కుదరని పొత్తు ఇది..
ఇంటింటి తతంగమిది..
అటు ఆలికి
ఇటు తల్లికి
నచ్చజెప్పలేక
నలిగిపోతాడు అర్భకుడు.
అత్తలేని కోడలుత్తమురాలు
కోడలు లేని అత్త గుణవంతురాలు
తరాల అంతరాలు తెచ్చాయి
కొన్ని మార్పులు
అన్న నానుడి
నిజమౌతుంది ఈ రోజుల్లో
విద్యలు నేర్చి ప్రతిభతో రాణించినా
తప్పని తిప్పలు
నోటి దుల తీర్చుకొనే
అత్తలు కొందరుంటే
అవగాహనతో అర్థం చేసుకుని
కోడలిని కూతురిగా
చూసుకుంటున్నారు కొందరు
నీ నా తప్పులెంచక సర్దుకుపోతే
తంపులు లేని ఇల్లు స్వర్గసీమే కదా..!.

**-పి.పద్మావతి**

## చేసుకున్న వాళ్లకు చేసుకున్నంత!

అత్తా ఒకింటి కోడలే ఆనాడు...
అది మరువరాదు ప్రతి అత్తా ఈనాడు!
అత్తారింట్లో పడ్డ అగచాట్లు దొంతరగా
మరీ మరీ మనస్సును తొలిచేస్తుంటే
ఆ సాధింపులకు శాంతి ఎలా అనుకొంటే
దొరికింది ఒక బకరా కోడలి రూపంలో!
ఇక సాధింపులు షురూ చేస్తది అత్త!
ఇన్నాళ్లుగా పెంచుకున్న తన కొడుకు
ఇంకో పిల్ల చేతిలోకి వెళితే ఓర్వక
నేనే తినిపిస్తా నా కొడుకుకనో
నాతోనే చాలా సేపు మాట్లాడాలనో
సినిమాలకు నాతోనే రావలెననో
కాఫీ ఇవ్వడానికి ఇంత సేపా అనో
కాళ్లు పీకుతున్నాయి పట్టమనో
శతవిధాల సాధించే అత్తలు నాడు!.
నేడు మారిన కాలంలో కోడళ్ళు
ఉద్యోగాలు వెలగబెడుతూ
మొగుడిపై ఆధార పడని రోజులివి!
సీను తిరగబడింది నేటి కాలంలో!
కోడళ్ళే సాధిస్తున్నారు అత్తలను!
అత్తలేని కోడలు ఉత్తమురాలని,
కోడలు లేని అత్త గుణవంతురాలని
అనుకునే రోజులు మారిపోయాయి!
అత్తలు అమ్మల్లా గుండెలకు హత్తుకుంటే
కోడలు ప్రేమతో
కూతురులా చూస్తుందిగా!!.

**-కోలా సత్యనారాయణ**



2024 జనవరి నుండి ఫేస్బుక్ అమరావతి సాహితీ మిత్రులు గ్రూపులో, వాట్సప్ గ్రూపులో డా రావి రంగారావు సాహిత్యం వర్క్ షాపులు నిర్వహిస్తున్నారు. ఈ వారం కథల వర్క్ షాప్‌లో **కుక్కల బెడద** గురించి రాసిన దాసు గారి కథ చదవండి.

-డా॥రావి రంగారావు
9247581825

-సంపాదకులు

# నిశ్శబ్ద పోరాటం
(కథ)

రాత్రి పది గంటలు దాటింది.

రోజంతా ఆఫీస్ పనితో అలసిపోయిన రాము, బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. నగర వీధుల సందడి క్రమంగా తగ్గిపోతోంది. మెయిన్ రోడ్డును దాటి తన కాలనీలోకి తిరగ్గానే ఆ నిశ్శబ్దం అతని గుండెల్లో చెప్పలేని భయాన్ని నింపింది.

వీధి చివర మున్సిపాలిటీ చెత్తకుండీ చుట్టూ పదికి పైగా వీధి కుక్కలు గుంపుగా కనిపించాయి. వాటి కళ్లల్లో మెరుస్తున్న అప్రమత్తత, ఆకలి, ఆందోళన రాముకు కొత్తేమీ కాదు.

ఆ కాలనీలో వీధి 'కుక్కల బెడద' రోజురోజుకూ తీవ్రమవుతోంది. మొన్న ఓ చిన్నారిపై దాడి చేశాయి. నిన్న ఓ వృద్ధుడిని గాయపరిచాయి. కాలనీవాసులు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా, అధికారులు వచ్చి చూసిన దాఖలాలే లేవు. చెత్తకుండీలు రోజులు తరబడి ఖాళీ చేయకపోవడంతో అక్కడే కుక్కల గుంపులు స్థిరపడ్డాయి.

"ఈ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటికి చేరితే చాలు..." అని మనసులో అనుకుంటూ రాము బైక్ వేగం కొద్దిగా పెంచాడు.బైక్ శబ్దం వినగానే కుక్కల గుంపు ఒక్కసారిగా లేచింది. కొన్ని గట్టిగా మొరగసాగాయి. మరికొన్ని బైక్ వెనుక పరుగెత్తాయి. రాము గుండె వేగం పెరిగింది.వేగాన్ని మరింత పెంచాడు.అంతలో ఒక కుక్క అతని కాలు అందుకోవడానికి ఎగిరింది. భయంతో హ్యాండిల్‌ను ఒక్కసారిగా తిప్పేసరికి బైక్ అదుపు తప్పి స్కిడ్ అయింది. రాము రోడ్డుపై బలంగా పడిపోయాడు.



చేతికి, మోకాలికి గట్టిగా దెబ్బలు తగిలాయి. లేవడానికి ప్రయత్నించేలోపే కుక్కలు అతన్ని చుట్టుముట్టాయి."ఇక అంతే..." అని అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు.

అప్పుడే... చీకటిని చీల్చుకుంటూ ఒక పెద్ద కర్ర కుక్కల మధ్య పడింది. "హేయ్... పోండి!" అంటూ గంభీరంగా వినిపించిన అరుపుతో కుక్కలు ఒక్కసారిగా వెనక్కి తగ్గాయి.

చేతిలో మరో కర్రతో పరుగెత్తుకుంటూ వచ్చిన వ్యక్తి కాలనీ సెక్యూరిటీ గార్డ్ ఈశ్వరయ్య. అరవై ఏళ్ల వయసులోనూ తన ప్రాణాలను లెక్కచేయకుండా కుక్కలను తరిమికొట్టాడు. "బాబూ... లేవండి..." అంటూ రామును నెమ్మదిగా పైకి లేపాడు. ఒంటిపై దుమ్ము దులుపుతూ ఆప్యాయంగా అడిగాడు."దెబ్బలు బాగా తగిలాయా?"అని. "కొంచెం..." అని నొప్పిని దాచుకుంటూ చెప్పాడు రాము. ఈశ్వరయ్య నిట్టూర్చాడు. "ఈ కుక్కల గురించి కాలనీ అసోసియేషన్‌కు ఎన్నోసార్లు చెప్పాం బాబూ. మున్సిపాలిటీకి ఫిర్యాదులు చేశాం. అధికారులు వచ్చి ఫొటోలు తీసుకెళ్తారు... అంతే. మరుసటి రోజు మళ్లీ ఇదే పరిస్థితి. మనుషుల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే ఇప్పుడు పెద్ద ప్రమాదంగా మారింది." ఆ మాటల్లో నిస్సహాయత కంటే బాధ ఎక్కువగా కనిపించింది.

రాము కృతజ్ఞతగా అతని చేతులు పట్టుకున్నాడు."ఈ రోజు మీరు లేకపోతే..."ఈశ్వరయ్య చిరునవ్వు నవ్వాడు. "మనిషికి మనిషే అండ బాబూ... జాగ్రత్తగా ఇంటికి వెళ్లండి"అని అన్నాడు ఈశ్వరయ్య.

ఇంటికి చేరేసరికి భార్య శారద గుమ్మం దగ్గరే ఎదురుచూస్తోంది. భర్త ఒంటినిండా దుమ్ము, చేతులపై రక్తం కనిపించగానే ఉలిక్కిపడింది. "ఏమైంది?" జరిగిన విషయమంతా విన్న ఆమె కళ్లల్లో నీళ్లు కమ్ముకున్నాయి.

గాయాలకు మందు రాస్తూ వణుకుతున్న గొంతుతో అంది? "ఈ ఊర్లో ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. రేపు మన బాబు స్కూలుకు వెళ్లాలన్నా భయంగా ఉంది. అసలు ఈ సమస్యకు ముగింపు లేదా?" రాము సమాధానం చెప్పలేకపోయాడు.ఆమె ప్రశ్నకు సమాధానం తన దగ్గర లేదని అతనికి తెలుసు.

మంచంపై పడుకున్నా నిద్ర మాత్రం పట్టలేదు. ఈశ్వరయ్య మాటలు చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. "మనుషుల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదం..." బయట నిశ్శబ్దం అలుముకుంది. కానీ ఆ నిశ్శబ్దం వెనుక దాగి ఉన్న తుఫాను గురించి ఎవరికీ తెలియదు...

అర్థరాత్రి దాటింది. నిద్రలోకి జారుకున్న రాముకు ఒక్కసారిగా బయట భయంకరంగా కుక్కలు మొరగడం వినిపించింది. వెంటనే ఒక చిన్నారి ఆర్తనాదం ఆ నిశ్శబ్దాన్ని చీల్చేసింది. "అమ్మా... తాతయ్యా...!"ఆ కేక విన్న రాము ఉలిక్కిపడి మంచం మీద నుంచి లేచాడు. బయట అప్పటికే జనాలు పరుగులు తీస్తున్నారు.గుండెల్లో తెలియని భయంతో రాము కూడా వీధిలోకి పరుగెత్తాడు.

వీధి దీపం కింద కనిపించిన దృశ్యం అతని గుండెను చీల్చేసింది. రక్తపు మడుగులో ఒక చిన్నబాబు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతను మరెవరో కాదు... కొద్ది గంటల క్రితమే తన ప్రాణాలను కాపాడిన సెక్యూరిటీ గార్డ్ ఈశ్వరయ్య మనవడు చరణ్. తాతకు రాత్రి భోజనం తీసుకొస్తూ మార్గమధ్యంలో కుక్కల గుంపుకు చిక్కిపోయాడు.

ఈశ్వరయ్య మనవడిని గుండెలకు హత్తుకుని గుండెలవిసేలా విలపిస్తున్నాడు."చరణ్...నాయనా...తాతకు అన్నం పెట్టడానికి వచ్చావా? ఈ వీధులకే నేను ఎన్నేళ్లుగా కాపలా కాశాను. కానీ...నా కన్నుల ముందే నిన్ను కాపాడుకోలేకపోయానురా"..అని బిగ్గరగా ఏడ్చాడు.

ఆ వృద్ధుడి రోదనతో అక్కడున్న ప్రతి గుండె భారమైంది. చరణ్ చేతిలోని చిన్న స్టీల్ క్యారియర్ పక్కనే పడిపోయింది. దాని మూత తెరుచుకుని అన్నం నేలపై చెల్లాచెదురైంది. ఆ తెల్లని అన్నంలో కలిసిన ఎర్రని రక్తపు చారలు ఆ రాత్రి సమాజ మనస్సాక్షిపైనే రాసిన నిందాపత్రంలా కనిపించాయి.

చుట్టూ వందమందికి పైగా జనం చేరుకున్నారు.కొంతమంది అధికారులను తిడుతున్నారు. మరికొందరు మొబైల్ ఫోన్లలో వీడియోలు తీస్తున్నారు. మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. కానీ...ఆ చిన్నారి ప్రాణం కోసం తపనపడుతున్న ఆ క్షణంలో ముందుకు వచ్చి సహాయం చేయాల్సిన చేతులు మాత్రం చాలా తక్కువగా కనిపించాయి.

రాము నెమ్మదిగా చరణ్ చేతిని పట్టుకున్నాడు.చిన్నారి వేళ్లు చల్లబడిపోతున్నాయి.ఆ అర్ధనిమీలిత నేత్రాలు..."నా తప్పేంటి?" అని సమాజాన్నే ప్రశ్నిస్తున్నట్టుగా కనిపించాయి.

రాము కళ్లలో నీళ్లు రాలేదు.

అతని రక్తం మాత్రం మరిగిపోయింది. ఆ క్షణంలో అతనికి ఒక నిజం స్పష్టంగా అర్థమైంది.ప్రమాదం సృష్టించేది కేవలం వీధి కుక్కలు మాత్రమే కావు..అపాయం కనిపిస్తున్నా చర్యలు తీసుకోని నిర్లక్ష్య వ్యవస్థ..సమస్య పెరుగుతున్నా స్పందించని అధికారులు...ప్రాణాల కంటే వీడియోలకు విలువిచ్చే సమాజపు నిర్లిప్తత...వీటన్నింటి కలయికే అసలు ప్రమాదం.

మరుసటి రోజు చరణ్ అంత్యక్రియలకు కాలనీ మొత్తం వచ్చింది. పూలమాలలు వేశారు.

కన్నీళ్లు పెట్టుకున్నారు.సానుభూతి మాటలు చెప్పారు. కొంతమంది అధికారులూ వచ్చి విచారం వ్యక్తం చేశారు.కానీ.. ఈశ్వరయ్య కళ్లల్లో మాత్రం ఒకే ప్రశ్న. "నా మనవడిని ఇప్పుడు ఎవరు తిరిగి తీసుకొస్తారు?" ఆ ప్రశ్నకు ఎవరి దగ్గరా సమాధానం లేదు.

ఆ రోజు సాయంత్రం రాము మౌనంగా ఉండలేదు. కాలనీవాసులందరినీ సమావేశపరిచాడు.సంతకాల సేకరణ చేపట్టాడు. మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించాడు.

జంతు సంక్షేమ సంస్థలతో సమావేశమై వీధి కుక్కల శాస్త్రీయ నియంత్రణ, టీకాలు,శస్త్రచికిత్సలు, చెత్త నిర్వహణ వంటి అంశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ప్రజల భద్రతతో పాటు జంతు సంక్షేమం కూడా సమన్వయంగా ఉండేలా పరిష్కారం కోసం నిరంతరం పోరాడాడు. మీడియా కూడా స్పందించింది. అధికార యంత్రాంగం కదిలింది.

కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేశారు.చెత్త నిర్వహణను క్రమబద్ధీకరించారు. వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమాలను వేగవంతం చేశారు.

కొన్ని నెలల తర్వాత...అదే వీధిలో చిన్నపిల్లలు నిర్భయంగా ఆడుకుంటున్నారు. ఆ దృశ్యాన్ని చూసి రాము ఆకాశం వైపు చూశాడు. మనసులోనే మెల్లగా అన్నాడు: "చరణ్... నిన్ను తిరిగి తీసుకురాలేకపోయాం. కానీ నీ చిన్న ప్రాణత్యాగం వృథా కాలేదు. మరో చిన్నారి కన్నీరు కారకుండా ఉండేందుకు నువ్వు కారణమయ్యావు. అదే నీకు మా నిజమైన నివాళి."

ఆకాశంలో ఒక చిన్న నక్షత్రం మెరిసింది. అది చరణ్ చిరునవ్వులా అనిపించింది.

ఆ రాత్రి రాము ఒక విషయాన్ని గట్టిగా గ్రహించాడు: సమస్యలపై మౌనం వహించే ప్రతి మనిషీ, ఆ సమస్యను మరింత పెంచినట్టే. నిర్లక్ష్యం మాట్లాడదు... కానీ ప్రాణాలను బలితీసుకుంటుంది.

అందుకే ప్రతి పౌరుడు బాధ్యతగా మౌనం వీడి స్పందించినప్పుడే సమాజం సురక్షితంగా మారుతుంది.



-పేర్లి దాసు
9963249775

# అశ్రు నివాళి



దివికి చేరిన స్వర సరస్వతి
భూమిపై అమరమైన గానమూర్తి
గాన సరాగాల పుట్టిల్లు.. తెలుగు నేల గర్వం
కోటి పాటల్లో ప్రాణం పోసిన కళామతల్లి
జానకమ్మ తల్లీ.. నీ పేరే ఒక యుగం.

గొంతులో వెన్న, మాటలో తేనె
పల్లవిలో ప్రేమ, చరణంలో కరుణ
నీ గానం వినని తెలుగు ఇల్లు ఉందా?
అమ్మలా లాలి పాడిన స్వర లక్ష్మివి .

ఆకాశం నుండి ఊడిపడిన స్వర ధారవు నువ్వు
తెలుగు పలుకుల్లో కరిగిన పంచదారవు నువ్వు
ఘంటసాల గారి పక్కన నిలబడి యుగాలు గెలిచావు
ఇళయరాజా రాగాలకు ప్రాణం పోశావు.

ఏమని పాడనుఅంటూ హృదయాన్ని తట్టావు
లెట్స్ పిక్నిక్ అంటూ యవ్వనాన్ని ఊపావు
పాల బుగ్గల పాపగా పసితనం అయ్యావు
ఇదేనా లోకం అంటూ తత్వాన్ని చెప్పావు.

ఆలపించు అంటే కోయిల అయ్యావు
అల్లరి పిల్ల అంటే చిలిపి అయ్యావు
ఎందుకు ఈ బాధ అంటే అమ్మ అయ్యావు
గోవిందా గోవిందా అంటే భక్తి అయ్యావు .

నాలుగు తరాల పెళ్ళిళ్ళలో నీ పాటే
మంగళం
నాలుగు తరాల స్కూళ్ళలో నీ పాటే ప్రార్థన
అమ్మ జోలపాట
నుండి అమ్మమ్మ భజన వరకు
అన్నీ నువ్వే జానకమ్మ తల్లీ.
భక్తి పాటలో దేవతవు
ప్రేమ పాటలో ప్రియురాలివి
విషాద గీతంలో తల్లివి
నీ గళం లేని భావమే లేదు.

పదివేల కాదు... ఇరవై వేలకుపైగా గీతాలతో
సంగీత చరిత్రనే ఆలపించావు"
ఎం.ఎస్. విశ్వనాథన్ నుండి ఇళయరాజా
వరకు... సంగీత మహర్షుల స్వరసృష్టికి
జీవం పోసిన గానమూర్తివి"
ఇవాళ నీ స్వరం ఆగిపోయినా
రేడియోలో, టేపులో, గుండెల్లో
నువ్వు ఎప్పటికీ పాడుతూనే ఉంటావు .
కాలమే కాసేపు ఆగి నిలబడి వినే మీ గళం
వినిపిస్తే తన గాయాలన్నీ మరిచిపోతుంది
భూమి నిన్ను గాయని అని పిలిచింది...

కాలం నిన్ను
గానగంధర్వి అని నిలబెట్టింది...
చరిత్ర నిన్ను అమరస్వరంగా లిఖించింది...
తెలుగు జాతి నిన్ను తన గుండెల్లో శాశ్వతంగా
ప్రతిష్ఠించింది.
తిరిగిరాని లోకానికి వెళ్ళావు
స్వర్గంలో కూడా దేవతలు నీ పాట కోసం
ఎదురుచూస్తున్నారు
తల్లీ జానకమ్మ..
తమ స్వరానికి సాష్టాంగ నమస్కారం
తమ గానానికి అక్షర అంజలి ...
మీ శరీరం నిశ్శబ్దమైనా,
మీ స్వరం శాశ్వతం.
మీ గానం మా జ్ఞాపకాల దేవాలయంలో
ఎప్పటికీ వెలిగే నిత్య దీపం.
ప్రతి తెలుగు గుండె చప్పుడు ఉన్నంతవరకు
మీ గానం అమరం...
మీ జ్ఞాపకం అఖండం...
అక్షర అంజలి... అశ్రు నివాళి...

**-కె.శాంతి**
9963577965

## నివాళి

సుమధుర గాయని జానకమ్మ
కమ్మని గాత్ర గాన కోకిలమ్మ
చిత్ర సీమకే వెలుగు దివ్వె వమ్మ
పాటలకు ప్రాణం పోసిన అమ్మ.
సంగీతం సామ్రాజ్ఞ శిఖరానివమ్మ
ఎన్నో భాషలలో అలరించిన గొంతు
నీదమ్మ
భువి విడిచి దివి కేగితివమ్మ
శ్రోతల గుండెలలో కొలువైన మా అమ్మ
వినమ్రంగా మీకు మా నివాళి చేకొమ్మ

**- నమిలకొండ నాగేశ్వర్ రావు**
8688553470

## దివికేగిన గాయనీమణి.. జానకమ్మ

పాటే శ్వాసగా
పాటే ధ్యాసగా
జీవన ప్రస్థానం కొనసాగించిన
అపురూపమైన అద్భుతమైన
సినీ గాయని ఎస్. జానకమ్మ.
భారతావనికి ఘన కీర్తిని తెచ్చిన
అరుదైన గానకోకిల ఎస్.జానకి
ఆమె పాటలంటే ఇష్టం అందరికి
ఏ పాటైనా పాడగలిగే గాయనీ మణి
ఆమెకు సాటి పోటిగా లేరు ఏ గాయని.
భారతీయ చిత్రసీమకు ఆమె ఓ వరం
ఆమె స్వర విన్యాసం ఓ సమ్మోహనం
ఆమె పాడిన పాటలు నిత్యనూతనం
ఆమె గానప్రతిభ అనితర సాధ్యం
భువి నుండి దివికి తరలిపోయిందమ్మ
గాంధర్వ గాయనీమణి ఎస్. జానకమ్మ
ఆ మహా గాయనీకి ప్రణామాలు
నా హృది అర్పిస్తోంది నివాళులు

**-బూర దేవానందం**
8143589789

## ఘనంగా జరిగిన శ్రీశ్రీశ్రీ సిద్ధప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం

# ప్రజలను ఆలోచింపజేసిన గొప్ప కవి

-డా॥ఎన్.బాలాచారి



సిద్ధప్ప వరకవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

హైదరాబాద్, జులై 15:ప్రజలను ఆలోచింపజేసిన గొప్ప కవి శ్రీశ్రీశ్రీ సిద్ధప్ప వరకవి రాజయోగి అని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ ఎన్. బాలాచారి కొనియాడారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో అఖిల భారతీయ కుమ్మర శాలివాహన ప్రజాపతి కుంభకార్ మహాసంఘ్, తెలుగుభాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న రవీంద్రభారతి సాహితీ కుటీరంలో శ్రీశ్రీశ్రీ సిద్ధప్ప వరకవి జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥ఎన్.బాలాచారి మాట్లాడుతు.. ఎంతో మంది మేధావులు మన తెలంగాణలో జన్మించి ప్రజలకు మంచిని బోధించారని అన్నారు. తమజ్ఞానాన్ని ప్రజలకు దారపోశారని, సమాజంలో వున్న కుళ్ళును, కుతంత్రాలను కళ్ళకు కట్టినట్టు ఎత్తిచూపారని అన్నారు. ప్రజలను జాగృతం చేయడంలో తమ వంతు కృషి చేశారని అందులో శ్రీశ్రీశ్రీ సిద్దప్ప వరకవి రాజయోగి ఒకరని కీర్తించారు. అకాడమీ ప్రచురించిన క్యాలెండర్‌లో పలువురు ప్రముఖులతో పాటు వరకవి రాజయోగికి స్థానం కల్పించామని అన్నారు.

విశిష్ట అతిథి బైస దేవదాసు మాట్లాడుతు.. సిద్దప్ప వరకవి దొరలకు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో చైతన్యం రగిలించే రచనలు చేశారని అన్నారు. రాష్టంలో చాలా చోట్ల భజన మండలులు సిద్దప్ప వరకవి రాసిన పద్యాలు పాడుతుంటారని ఆయన రచనలు మనిషిలో మార్పును తెచ్చే విధంగా వుంటాయని అన్నారు. సిద్ధప్ప వరకవి రచనలు వెలుగులోకి తేవాలని, ఆయా పాఠశాలలో వ్యాస రచన పోటీలు నిర్వహించి వరకవి రచనలను పరిచయం చేయాలని అన్నారు. విద్యార్థులు చైతన్య వంతులవు తారని ఆ దిశగా కృషి చేయాలని తెలిపారు.

మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపకులు కటకం నర్సింగ రావు మాట్లాడుతు.. బోనాల పండుగ రాబోతోందని ప్రతి బోనం మనం తయారు చేసిన కుమ్మరి కుండతోనే ప్రారంభమవుతుందని కమ్మర కులంలో జన్మించిన మన వరకవి రాజయోగి గురించి కరపత్రాలు ముద్రించి బోనాలు నిర్వహిస్తున్న ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అందజేయడం వల్ల వరకవి గురించి పదిమందికి తెలుస్తుందని అన్నారు.

సిద్దప్ప వరకవి రాజయోగి జయంత్యుత్సవం ప్రతి సంవత్సరం ప్రభుత్వం నిర్వహించేట్టు కృషి జరగాలని రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి, జయంతి కన్వీనర్ సిలివేరు శంకర్ ప్రజాపతి అన్నారు. సభను విజయవంతం చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులు మిరుదొడ్డి శివానంద్ ప్రజాపతి ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపకులు బడేసాబ్ మాట్లాడుతు.. సిద్దప్ప వరకవి రచనలు ప్రజలకు అందుబాటులోకి తేవాలని., గత కొంతకాల ంగా సిద్దప్ప జయంత్యుత్సవాలను నిర్వహిస్తు న్నామని అన్నారు. రాజగోపాల్‌నాయుడు, చిట్టిమల్ల అశోక్‌కుమార్ ప్రజాపతి, దొమ్మాట నాదం ప్రజాపతి పలువురు పాల్గొన్నారు. శ్రీమతి రాధకుసుమ నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు కవితాగానం చేశారు.




సభలో ప్రసంగిస్తున్న డా॥ఎన్. బాలాచారి. వేదికపై మిరుదొడ్డి శివానంద్ ప్రజాపతి, కటకం నరసింహారావు. బైస దేవదాసు, బడేసాబ్. ౦ ప్రసంగిస్తున్న శిలువేరు శంకర్ ప్రజాపతి, కటకం నరసింగరావు, బడేసాబ్.

## కన్నీటి షవర్!

కొందరు అధికారమనే అస్త్రాన్ని పట్టుకొని
తమకన్నా గొప్పవాళ్ళు లేరనే భ్రమలో
తమ క్రింద పనిచేసే వాళ్ళను వేధిస్తూ
మానసికంగా, ఆర్థికంగా నష్టపరుస్తూ
అసత్యాలతో 'నిందల వర్షం' కురిపిస్తూ
వారి 'కన్నీటితో షవర్ స్నానం' చేస్తున్నారు!

దైవమిచ్చిన అధికారమనే నీ బాధ్యతను
నీ అహంకారానికి అలంకారంగా భావిస్తే-
ఎవరైనా నీవల్ల కార్చిన ప్రతీ కన్నీటి చుక్క
కర్మ రూపం దాల్చి నిన్ను, నీ సంతానాన్ని
కనికరం లేకుండా వెంటాడి వేటాడుతుంది
అప్పుడు నీ అధికార హెూదా, ఆస్తి అంతస్తులు
'ఎన్ని నీ వశమైనా..
నువ్వు బ్రతికున్న శవమే'!

– డా. డి. రాజేశ్
9440460490



## వానమ్మ ఓ సారి... వచ్చి పోవమ్మ..!



నేను చెలుకలు
బీటలు బారినవి
ఎద్దు ఎవుసం
మొద్దు బారినది
పంట సాగుచేద్దామన్న
ఒక వాన లేదు..!
ఒక వాగు లేదు..!
నేలమీద
ఒక విత్తునాటలేదు
నాటిన వరి మొక్కలు
మెడలు పడేస్తున్నాయి...
తిందామంటే మెతుకు
జారదం లేదు!
పందామంటే కునుకు రాకపాయె...
పొలంలో నీళ్లు లేక
మనసంతా నీళ్ళే కావటే
కడుపుకట్టి కౌలుకడితిని
ఉత్తచేతులతో ...
కుటుంబానికి పస్తులుంచితిని
ఓ వానమ్మా...
ఓ సారి వచ్చి పోవమ్మ..!

-నాగం సాయిలు
9490209037.





తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు

## మన జానకమ్మ

జగమే ఊయల చేసి,
ఆ బాలగోపాలాన్ని అలరించిన రాగతరంగిణి
పాటపదాలకు సుమధుర పరిమళాలద్దిన
సుగాత్రి
రాగమాలికై కురిసిన సంగీత స్వరరాగిణి
మన జానకమ్మ భౌతికంగా ఇక లేరు
పాటే ప్రపంచంగా
స్వర సాధనలో ఆ స్వరం పలికిన స్వరాలెన్నో
ఎన్ని భాషలతో మైత్రి ఎన్నెన్ని వేల పాటలు
సిరిమల్లె పువ్వులా నవ్వుతుంది
చిన్నారి పాపలా అలరిస్తుంది
పడుచు ప్రాయపు సొగసులు
చిలిపి తనపుపరవళ్ళు
పండుమనసు రాగాలు
కన్నీటిని కరిగించే వేదనలు
ఆమె గళంలో ఇంపుగా ఒదిగి,
సొంపుగా వినిపిస్తాయి.
స్వరాలకు కులాలు లేవు మతాలు లేవు
ఆ స్వరాలు గాలి కెరటాలలో
ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి.
వచ్చిన పని ముగిసిందని
సగర్వంగా దివికేగుతున్న
నీలిగగనపు స్వరతారా!
ఓ దివ్యగాత్రి! స్వరధాత్రి!
నీ పాటలు మా మనసును
ఉత్సాహపరిచే పోషకాలు
మా హృదయాలను సేద తీర్చే
దివ్య ఔషధాలు
అమ్మా! జానకమ్మా!! అశ్రునయనాలతో
నీకు వీడ్కోలు వందనం
తల్లీ! నీ గానం అజరామరం

-గడ్డం సులోచన
7702891559.

## రాత్రి !!

సూర్యుడు
అస్తమించాడు-
పక్షులు విచారంగా గుటికి.
ఇంటింటా
అందరూ
సంతాపంగా
దీపాలు
వెలిగించారు !!
భూమి చీకట్లో పడిపోయింది

-కందాళై రాఘవాచార్య
8790593638

## వర్షమంతా వర్ష ఋతువే

మా వాడకట్టు వారు
రోజు స్నానం చేస్తారో లేదో తెలియదు కానీ
వాడలోని రోడ్లకి మాత్రం నిత్యము
అభ్యంగనమే!
కొళాయిలో మంచినీటి దార బిందెలు
నింపి
పొంగి పొరలీ వీధిలో విపాషా నదిలా
ప్రవహిస్తుంది
ఒకరి వాకిట్లో వాటర్ పైపుతో చల్లిన కల్లాపి
ఐదారు వాకిళ్లలోని ముగ్గులను
ముంచేత్తుతుంది
గతుకుల రోడ్డుపై రోజూ
పుంకాను పుంకాలుగా పంకపులంకలు
పలకరిస్తూనే ఉంటాయి
ఆగమేఘాల మీద దూసుకు వెళుతూ
నాలుగు చక్రాల నావలు చిమ్మే బురద నీటి
వరదకు
ఆదరాబాదరాగా ఆఫీస్ కు వెళ్లే
హైదరాబాద్ సోదరులు అదిరిపడి
ఆరు గజాల దూరం జరగాల్సిందే
రెండు చక్రాల పడవలు వెదజల్లే
మురికి నీటి మరకలు
ఇంట్లో ఆడవారితో పెట్టిస్తాయి చురకలు
బుజ్జి బుజ్జి బుడతలు బురదనీటిలో
టపటప అడుగులు వేస్తూ తీసే పరుగులు
చమక్కుమనే దుస్తులు ధరించి
చటుక్కున బస్టాప్ కి చేరాలనుకునే వారిని
చిన్న బోయిన ముఖంతో ఇంటి ముఖం
పట్టిస్తాయి.
ఇంటిని శుభ్రం చేయడానికి
వీధిని అపరిశుభ్రం చేయాల్సిందేనా?
హరిపత్నిని ఆహ్వానించడానికి
హరిపుత్రిని అవమానించాలా?.
వర్షాకాలంలో రోడ్లన్నీ
బురదగా ఉండడం సహజమే కానీ
మా నగరంలో మాత్రం
వర్షమంతా వర్ష ఋతువే


– ఆదిత్య కైరం కొండ
8790771348

## జన ప్రభంజనం జన రంజకం

ఆధునిక సాంకేతికతతో
అంతరిక్షంలోకి వెళుతున్నా
అత్యాశ వీడని మనిషి
అవనికే ముప్పు తెస్తున్నాడు!.
ప్రపంచంకుగ్రామంగా మారుతున్న
తరుణం
జనాభా దినదినం పెరుగుచున్న వైనం
దేశాలు సంఘజీవులు ఏకాకిగా మనలేవు!.
భూగోళం కిటకిటలాడే జనాభాతో
తేనె పట్టును తలపిస్తున్నది
పేదరికం నిరుద్యోగం ఆర్థిక అసమానతలు
గ్లోబు చుట్టూ తిరుగుచున్నవి!.
పెరుగుచున్న యువత ఆశలు ఆశయాలు
ఆకాంక్షలు సాకారం చేయుటకు
నేడు నైపుణ్య శిక్షణలు ఇచ్చి
అందమైనభవిష్యత్తుకు పునాది వేయాలి!.
పెరుగుచున్న అవసరాలు తీర్చుకోవడానికి
సహజ వనరుల వినియోగం తప్పదు
పారిశ్రామికీకరణతో
కాలుష్యం పెరుగుతున్నా
భవిష్యత్ లో కాలుష్యం కలుగజేయని
కార్మాగారాలు రావాలి!
యుద్ధాలు లేని రోజులు రావాలి!.
వీటన్నిటిని సమన్వయపరిచి
విద్య ఉపాధి ఆరోగ్య వసతులు
సామాన్యులకు అందుబాటులో ఉండేలా
ప్రభుత్వాలు కంకణం కట్టుకుంటే
జన ప్రభంజనం జనరంజకమే!.
(జూలై 11,ప్రపంచ జనాభా దినోత్సవం)

-పట్లోళ్ల బక్కా రెడ్డి
9705315250

# రాజకీయాల్లో చెరగని ముద్ర తేళ్ల లక్ష్మీకాంతమ్మ



తేళ్ల లక్ష్మీకాంతమ్మ... ఈ పేరు ఈ తరం తెలుగు వారికి అంతగా తెలియక పోవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆరున్నర దశాబ్దాల క్రితం లోకసభకు ఎన్నికై...నెహ్రూ, శాస్త్రి లాంటి నాటి కాంగ్రెస్ అగ్ర నాయకుల అభిమానాన్ని చూరగొని, తర్వాత ఇందిరా గాంధీ, పి.వి. నరసింహా రావు లాంటి ప్రధానులకు చేరువై, మహిళా పక్షపాతిగా పేరెన్నిక గన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ డిపాజిట్ రాని, ఒకనాటి కమ్యునిస్టు కంచుకోట అయిన ఖమ్మం నుండి లోక సభకు పోటీ చేసి తొలి విజయం నమోదు చేసి, అదే ఊపులో మరో రెండు సార్లు విజయ దుందుభి మోగించి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన రికార్డు ఆమెదే.

ఆమె రాజకీయ ఆరంగేట్రం ఎలా జరిగింది అంటే...1957లో తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కాంగ్రెస్ పార్టీని అడిగిన సందర్భంలో ఆమె భర్త ఒక ప్రభుత్వ అధికారి అయిన కారణం తో, ఆమెకు టికెట్ నిరాకరించారు. తాను ముందుగా భారత పౌరురాలినని, తర్వాతే అధికారి భార్యనని వాదించి, లాల్ బహదూర్ శాస్త్రిని మెప్పించి ఒప్పించి ఖమ్మం లోకసభ స్థాన టికెట్ పొందారు.

అసలు కాంగ్రెస్ కు అంతకుముందు డిపాజిట్లు కూడా దక్కని సీటులో ఆమె పోటీ చేయడం, గెలవడం ఏమిటని చర్చల నేపథ్యంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి, ఔరా అనిపించి ఆ సీటులో గెలిచి చూపించారు తేళ్ల లక్ష్మీకాంతమ్మ.

1957, 1962, ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతమ్మ వరుసగా మూడుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచారు. నెహ్రూ ప్రభు త్వంలో పార్లమెంటు కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. అలాగే ఆమె తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించి, అప్పటిదాకా సివిల్స్ లో మహిళ లకు ప్రవేశం లేని స్థితిలో, ఇందిరా గాంధీని ఒప్పించి సివిల్స్ లో మహిళ లకు అవకాశం లభించేలా చేశారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కోసం పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడారు. 1972లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా మహిళలు, యువకులకు ఎక్కువ టిక్కెట్లు వచ్చేలా కృషి చేశారు.

తెలంగాణ రాష్టానికి చెందిన

తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1924, జూలై 16న జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ లోని కమ్మ భూస్వా ముల కుటుంబానికి చెందిన వెంకట్ రెడ్డి - మంగమ్మ దంప తులకు జన్మించారు. 5వ తరగతి వరకు కర్నూలులో చదివి, గుడివాడలో ఎస్ఎస్ఎల్‌సీ, ఇంటర్మీడియట్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో, మచిలీ పట్నంలో బిఏ, బెనారస్ హిందూ విశ్వ విద్యా లయం నుండి 1971లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ పట్టా పొందారు. ఆమె 1944, నవంబరు 1న అనంతపురం జిల్లా అటవీ అధికారి టి.వి.సుబ్బారావును వివాహం చేసుకున్నారు.

లక్ష్మీకాంతమ్మ ఖమ్మం నియోజక వర్గం నుండి 1957లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, ఆ తర్వాత 1962లో, ఆ తర్వాత ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు ఎన్నికై 1977వరకు లోక్‌సభలో ఖమ్మంకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో పార్లమెంటు బృందంలో సభ్యురాలిగా ఆస్ట్రేలియా పర్యటించారు. 1978లో జనతా పార్టీ తరఫున హైదరాబాదు నగరంలోని హిమాయత్ నగర్ శాసనసభా నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఆమె తెలుగులో ప్రగతి పథంలో మహిళలు అనే పుస్తకాన్ని, ఆంగ్లంలో కో-ఆపరేషన్ టుడే అండ్ టుమారో అనే పుస్తకాల్ని ప్రచురించారు. బాద్షా ఖాన్ జీవితచరిత్రను తెలుగులోకి అనువదించారు.

తాను రాష్ట్రపతిగా ఎన్నిక కావడంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ పాత్ర కీలకమని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నారు దివంగత రాష్ట్రపతి వి.వి.గిరి. ఇందిరాగాంధీకి ఆమెతో ఉండిన సాన్నిహిత్యం దృష్ట్యా, ఎన్నిసార్లు అడిగినా కేంద్ర మంత్రి పదవి స్వీకరించ లేదని, ఒక దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా, ఆమె అంగీక రించక, మేధావి, అనుభవజ్ఞుడు అయిన పీవీ అయితేనే బాగుం టుందని చెప్పారని, వీవీ నరసింహా రావు ముఖ్యమంత్రి కావడానికి లక్ష్మీ కాంతమ్మ ఒక విధంగా కారణమని ఆ రోజుల్లో చెప్పుకునే వారు.

ఇందిరాగాంధీకి అంత సన్నిహి తురాలు అయినా, ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి, లక్ష్మీకాంతమ్మ కాంగ్రెస్ ను వీడి, జనతాపార్టీలో చేరి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. హైదరాబాద్ లో హిమా యత్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. హైదరాబాద్ లో బీహెచ్ఈఎల్, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రావడంలో ఆమెది కీలక పాత్ర అని చెబుతుంటారు. 2007 డిసెంబర్ 13న 83 ఏళ్ల వయ సులో మరణించారు.

జూలై 16....తేళ్ల లక్ష్మీకాంతమ్మ జయంతి

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# మానవ జీవితాలను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధ

ఒక ఎలక్ట్రానిక్ ఉపకరణం మానవున్ని అనుకరించడం, నేర్చుకోవడం, నిర్ణయాలను తీసుకోవడం లాంటి విధులను నిర్వహించడాన్ని "కృత్రిమ మేధ (ఆర్టిఫీసియల్ ఇంటెలిజెన్స్ లేదా ఏఐ)" అని చెప్పవచ్చు. నేడు ఏఐ రంగం ఒక టెక్నాలజీ అభివృద్ధే కాదని, రానున్న తరాల మానవ జీవితాలను విప్లవాత్మకంగా ప్రభావితం చేయనుందని తెలుసుకోవాలి. గత కొన్ని దశాబ్దాలుగా ఏఐ ప్రారంభ స్థాయి నుంచి నేడు భాషలను తర్జుమా చేయడం, ముఖాలను గుర్తించడం, వేలి ముద్రలకు పసిగట్టడం, వాహనాలను ప్రోగ్రామింగ్‌కు అనుగుణంగా ఆటోమెటిక్‌గా నడపడం, రోగాలను నిర్ధారణ చేయడం, చికిత్సతో పాటు రోబోటిక్ సర్జరీలు చేయడం లాంటి పనులను చేసే స్థాయికి అభివృద్ధి చెందింది. 2021లో ఏఐ ప్రాధాన్యాన్ని గుర్తించిన "జాసన్ కిర్టన్" అను శాస్త్రజ్ఞుడు ప్రతి ఏట 16 జూలై రోజున "ఏఐ ప్రశంస దినోత్సవం లేదా ఏఐ అప్రిషియేషన్ డే" నిర్వహించుకోవాలని ప్రపంచ మానవాళికి సందేశం ఇవ్వడంతో అది ప్రతి ఏటా సాంప్రదాయంగా ప్రపంచ దేశాలు జరుపుకోవడం కొనసాగుతున్నది.

**నిత్య జీవితంలో ఏఐ ప్రయోజనాలు:**

మానవాళి జీవనశైలితో ఏఐ విడదీయ రాని సంబంధాన్ని ఏర్పరుచుకుంటున్నది. నేడు వైద్యరంగంలో వ్యాధి నిర్ధారణ, చికిత్స, సర్జరీ లాంటి ప్రయోజనాలను కలిగి ఉన్నది. రవాణా రంగంలో ట్రాఫిక్ నియంత్రణ, ఆటోమెటిక్ వాహనాల రూపకల్పన లాంటివి జరుగుతున్నాయి. విద్యారంగంలో నూతన ఆకర్షణీయ బోధనా పద్దతులు, ట్యూటర్ విధులను ఏఐ సుసాధ్యం చేస్తున్నది. వినియోగదారుల సేవల్లో చాట్‌బాట్, వర్చువల్ ఏజెంట్స్ లాంటి విధులు నిర్వహించడంలో ఏఐ సఫలం అవుతున్నది. పర్యావరణ పరిరక్షణలో వాతావరణ నమూనాలు, శక్తి నియంత్రణ లాంటి పలు విధులను ఏఐ నిర్వహిస్తున్నది. వీటితో పాటు వినోదం, బ్యాంకింగ్, టెలీకమ్యూనికేషన్స్, ఆటోమొబైల్స్, గృహ విధులు లాంటి అనేక ప్రయోజనాలను ఏఐ కలిగి ఉన్నదని మన అనుభవం చెబుతున్నది. ఏఐ రంగం వరంగానే కాకుండా శాపంగా పలు నష్టాలను కూడా చూపుతోంది. పలు అనైతిక సమస్యలు, వ్యక్తిగత డాటా దుర్వినియోగాలు, ఉద్యోగాల్లో కోతలు, ఇతర పలు లోపాలను కలిగి ఉండడంతో కొంత జాగ్రత్త వహించాల్సి వస్తున్నది. ఏఐ టెక్నాలజీ ఒక ఇంజనీరింగ్ విభాగంలో శ్రమించే వారి అంశమే కాదు, ఆధునిక టెక్నాలజీని వినియోగించే లేదా వినియోగించని ప్రతి ఒక్కరికీ జీవితాలపై ప్రభావాన్ని చూపడం ఖాయమని తెలిసిపోయింది.

ఏఐ రంగం నైతిక విలువలకు లోబడి ఉండడంతో పాటు పారదర్శకత కలిగి మానవాళికి మేలు చేకూర్చే విధంగా ఉండాలని కోరుకోవాలి.

**భారతదేశంలో ఏఐ టెక్నాలజీ:**

భారత్‌లో ఏఐ రంగం వేగంగా వినియోగించబడుతూ, పలు విజయాలను నమోదు చేస్తున్నప్పటికీ ఇతర అభివృద్ధి చెందిన దేశాల టెక్నాలజీలతో పోల్చితే కొంత మందగమనం జరుగుతున్నట్లు అర్థం అవుతున్నది. ఏఐ విసురుతున్న పలు సవాళ్లను అధిగమిస్తూ రానున్న రోజుల్లో ఈ రంగంలో భారత్ కూడా పటిష్టమైన అడుగులు వేయాలని కోరుకుందాం. ఏఐ ప్రశంస దినం వేదికగా ఏఐ అనువర్తనాలను వివరించడం, చర్చలు నిర్వహించడం, ఏఐ ప్రాజెక్టులను ప్రదర్శించడం, ఏఐ పరిశోధకులను గుర్తించి ప్రశంసించడం, నైతికతను కాపాడడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

ఏఐ విప్లవం చూపిన బాటలో నడుస్తూ, ఏఐ టూల్స్‌ను మానవాళి శ్రేయస్సుకు వాడుకోవడం, భారతంలో మరో తరం ఏఐ విప్లవానికి నాంది పలకడం లాంటివి జరగాలని కోరుకుందాం, మానవుడి మేధస్సుకు ఏఐ సరి సమానం కాదని కూడా నమ్ముదాం.

(16 జూలై "కృత్రిమ మేధ ప్రశంస దినోత్సవం" సందర్భంగా)

-మధుపాళీ
9949700037



# మెదక్‌లో కల్తీ పాల దందా గుట్టురట్టు..

## -భారీగా రసాయనాలు, పౌడర్ స్వాధీనం

మెదక్, జులై 15:ప్రమాదకర రసాయనాలతో కల్తీ పాలు తయారు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఓ ముఠా గుట్టును బుధవారం పోలీసులు రట్టు చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని ఓ పాల కేంద్రంపై మెరుపు దాడులు నిర్వహించిన పోలీసులు కల్తీ పాలు తయారు చేస్తున్నట్లు అనుమానిస్తున్న ఓ వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తనిఖీల్లో లిక్విడ్ రసాయనాలు, పౌడర్‌తో పాటు పెద్ద మొత్తంలో అనుమానాస్పద పాలను స్వాధీనం చేసుకున్నారు.

పరిసర గ్రామాల రైతుల నుంచి పెద్దఎత్తున పాలను సేకరించి, వాటిలో ప్రమాదకర రసాయనాలు కలిపి రోజూ వందల లీటర్ల కల్తీ పాలను తయారు చేసి హైదరాబాద్‌తో పాటు ఇతర పట్టణాలు, స్వీట్ హౌస్‌లకు తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే స్వాధీనం చేసుకున్న పాలు, రసాయనాల నమూనాలను వెటర్నరీ వైద్యులు పరీక్షించిన తర్వాతే అవి కల్తీవో కాదో నిర్ధారణ అవుతుందని నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి తెలిపారు.

## గర్భశోకం!

చరచరలాడే ఎండా కాలంలో
ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం
వెర్రి దాహంతో బరితెగించి
నెలల బాలుని నెత్తురు తాగమరిగిందా?
పసిబాలుడి పాలిట బస్సుటైరే మృత్యువై
అమ్మను అన్యాయంగా శిక్షించింది
మహాలక్ష్మిలా కళకళలాడే ఆ తల్లి
నవ్వులమహారాజు లేని దీనురాలయి
మిగిలి
నిలువునా నీరై పొగిలిపోతుంది
ఎంత ఘోరం !ఎంత బాధాకరం!!
యేడాదంతా గమ్యస్థానాలకు చేర్చే బస్సు
యేకంగా మరలిరాని లోకాలకు
తోల్కపోతుందని ఊహించం!
మానవత్వం నీడల్లో
మనుషులు మూగినా బస్సులు ఆగినా
ఎంతకాలం మళ్లీ సంచలిస్తాయి!
నీలి ఆకాశంలోకి పావురాలు ఎగరేసి
పోలీసులు వినిపిస్తున్న శాంతి పాట సరేసరి
ఆగని అమ్మ అశ్రుధారల మాట సంగతేంటి
మరి?
చుట్టాల ఓదార్పు, ధైర్యవచనాల గాలి
ఎన్నాళ్లు వీస్తాయి?
చుట్టుముట్టిన జనసందోహం లోంచి
ఒక్క చేయైనా తుడిచేస్తుందా?
అమ్మ కండ్ల నుండి ఆగకపొంగే దుఃఖాన్ని
ఒక్క గుండైనా చల్లార్చుతుందా
అమ్మ గుండెలో ఎగిసిపడే బడబానాన్ని.
అమ్మ ఎత్తుకోవడానికి
బంగారంకొండైనబాబు లేడు బాధ తప్ప
హత్తుకోవడానికి
చంటిబిడ్డ లేడు గడ్డుకాలం తప్ప
పాలు ఎవరి కి పట్టాలని పరితపిస్తున్న
అమ్మకేం మిగిలింది
పుట్టెడుదుఃఖం పట్టరాని గర్భశోకం తప్ప
ప్రాంగణ రావిచెట్లమీద
మాపటి వేళ గుంపులుగుంపులుగా
అందంగాచిలుకలు వాలక ముందే
మండుటెండల మధ్యాహ్నంలో
అంతులేని చింతలు వాలాయి
కొమ్మ రెమ్మలు ఊగి దిగులుశృతిలో
పాడుతున్నబాలుని స్మృతి గీతం
ఎవరికి వినిపిస్తుంది ఇపుడు?
ప్రాంగణం ఎవరిది?పాపం ఎవరిది?
నేరం ఏవరిది? శిక్ష ఎవరికి?
ముద్దు మురిపాలొలుకు అమ్మ ఇల్లు
కలలు కాటగలసిన జీవితాకాశం కింద
భయంకర నిశ్శబ్దం నిండిన జైలే బహుశా
పరిహారాలకు,హామీల హారాలకు
అమ్మ శోకం అంతమవుతుందా?
అమ్మ కళ్ల ముందరే
రెప్పపాటులో ఆశలురాలిపోయినపుడు
కుప్పకూలిపోక ఏమౌతుంది ఆ కన్నతల్లి
ఎవరి మీద పోస్తుంది ఇపుడు పిడుకెడు
మన్ను?
కరుణలేని కాలం మీదనా?
కళ్లు లేనిరాజ్యం మీదనా?.

-రమేశ్ నల్లగొండ
8309452179

## స్వరానికి మరణం లేదు

స్వరం ఒక శబ్దం కాదు
మనసు పలికే నిశ్శబ్ద భాష
అది హృదయాల నుంచి పుట్టి
హృదయాలకే చేరే వెలుగు
కాలం శరీరాన్ని అలసిపోనివ్వొచ్చు
కానీ
స్వరాన్ని మసకబార్చలేదు
మంచిపాట ఎప్పటికీపాతబడదు
మంచిగానం ఎప్పటికీ మరుగున పడదు
ఒకగొంతు మౌనమైనా
అగొంతు పలికించిన భావాలు
తరతరాల హృదయాల్లో
మర్మోగుతూనే ఉంటాయి
సంగీతం సరిహద్దులుదాటుతుంది
భాషలు దాటుతుంది
కాలాన్ని కూడా దాటుతుంది
అందుకే
స్వరానికి మరణం లేదు
అది జ్ఞాపకమై నిలుస్తుంది
ప్రేరణగా వెలుగుతుంది
మానవత్వాన్ని మేల్కొలిపే
అమరనాదంగా యుగయుగాలుజీవిస్తుంది
(యస్. జానకి గాయని దక్షిణ భారత కోకిల మరణించిన సందర్భంగా వారిని స్మరిస్తూ)

-రెడ్డిపల్లి వెంకటేశం
9515689569

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.